మన
నేషనలిస్ట్ వాయిస్
తెలుగు దిన పత్రిక
RNI : TGTEL/25/A4284
www.mananationalistvoice.com
epaper.mananationalistvoice.com

రిపోర్టర్లు కావలెను
మన నేషనలిస్ట్ వాయిస్ తెలుగు దిన పత్రిక
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.
తెలుగు రాష్ట్రాలలో సంచనాలు సృష్టిస్తున్న నేషనలిస్ట్ వాయిస్ మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తోంది. రిపోర్టర్లు కావాలి.
ఇంకెందుకు ఆలస్యం...
9666023180.8096660656 నంబర్లకు

ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 172 | 20 బుధవారం, మే 2026 | పేజీలు :12 | వెల: రూ. 3/-

హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్ నగర్, ఖమ్మం, విజయవాడ, గుంటూరు, అమరావతి, క్రిష్ట, గోదావరి, కర్నూలు, చిత్తూరు, కడప, ప్రకాశం, శ్రీకాకుళం

# సుస్థిర పట్టణాభివృద్ధి, సర్క్యులర్ ఎకానమీ దిశగా చర్యలు

- తెలంగాణలో శాస్త్రీయంగా వ్యర్థాల నిర్వహణ
- పక్కాగా ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమం
- బయో ఎరువులు, విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యం
- స్వచ్ఛ భారత్ మిషన్ జాతీయ సమీక్ష సమావేశంలో భట్టి



**న్యూఢిల్లీ,మే19నేషనలిస్ట్ వాయిస్**

తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన తెలంగాణ విజన్-2047 లక్ష్యాలకు అనుగుణంగా భవిష్యత్ అవసరాలకు సరిపోయే విధంగా, సుస్థిరంగా, సమగ్రంగా, పర్యావరణహితంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం క్యూర్, ప్యూర్, రేర్ అభివృద్ధి విధానాన్ని అనుసరిస్తోందని, ఇందులో కోర్ అర్బన్ రీజియన్, పెరి అర్బన్ రీజియన్, రూరల్ అగ్రికల్చరల్ రీజియన్‌ల సమతుల్య అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ఘన వ్యర్థాల నిర్వహణ అనేది ఇకపై కేవలం చెత్త సేకరణకు పరిమితం కాదని, అది వాతావరణ మార్పులకు ప్రతిస్పందన, పర్యావరణ సుస్థిరత, సర్క్యులర్ ఎకానమీ, ఉపాధి కల్పన, ఆర్థిక ఉత్పాదకతలతో నేరుగా అనుసంధానమై ఉందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పట్టణ పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అధ్యక్షతన ప్రారంభమైన రెండు రోజుల 'స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ 2.0' జాతీయ సమీక్ష సమావేశానికి తెలంగాణ రాష్ట్రం తరపున ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు హాజరయ్యారు. మొదటి రోజు సమావేశంలో దేశంలోని పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ఇంటింటి చెత్త సేకరణ, వ్యర్థాల శాస్త్రీయ ప్రాసెసింగ్, పాత చెత్త కుప్పల తొలగింపు, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, పీపీపీ విధానాలు, కొత్త ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల అమలు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. రాష్ట్రాలు, నగరాలు అమలు చేస్తున్న అనుభవాలు, ఉత్తమ విధానాలను పరస్పరం పంచుకోవడంపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ విధానాలు, సుస్థిర పట్టణాభివృద్ధి చర్యలు, స్వచ్ఛత కార్యక్రమాలు, సర్క్యులర్ ఎకానమీ దిశగా చేపడుతున్న కార్యక్రమాలను ఉప ముఖ్యమంత్రి సమావేశంలో వివరించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకు వచ్చిన ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు-2026 దేశంలో వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలో కీలక మార్పుకు దారితీస్తున్నాయని తెలిపారు. కొత్త నిబంధనలు సంప్రదాయ చెత్త సేకరణ, డంపింగ్ విధానాలకే పరిమితం కాకుండా, 4-వే సోర్స్ సెగ్రిగేషన్, వికేంద్రీకృత వ్యర్థాల ప్రాసెసింగ్, పాత డంప్‌యార్డుల శాస్త్రీయ శుద్ధి, వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ, సర్క్యులర్ ఎకానమీ, వార్డు స్థాయి బాధ్యత, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

## రైతునేస్తం 92వ ఎపిసోడ్ కార్యక్రమంలో రైతులకు దిశానిర్దేశం

**హైదరాబాద్,మే19నేషనలిస్ట్ వాయిస్**

రాష్ట్రవ్యాప్తంగా రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు పంట దిగుబడుల్లో కీలకపాత్ర పోషించే భూసార ఆరోగ్య పరిరక్షణ, రసాయన ఎరువుల వినియోగం తగ్గింపు లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం రైతులకు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు, 90 శాతం సబ్సిడీపై జిప్సం ఎరువులను అందిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ వెల్లడించింది.




వివరాలు 2లో

## ఎబోలాపై అప్రమత్తమైన భారత్

### ప్రజలకు హెచ్చరిక చేసిన అధికారులు

**న్యూఢిల్లీ,మే19నేషనలిస్ట్ వాయిస్**




ఆఫ్రికాలోని కాంగో, ఉగాండా సహా పలు దేశాల్లో ఎబోలా వైరస్ వేగంగా విజృంభిస్తోంది. ఈ ప్రాణాంతక వ్యాధి కారణంగా ఇప్పటికే 100 మంది మృతి చెందారు. 390 అనుమానిత కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. కాంగోలోని ఆరుగురు అమెరికన్లకు ఈ వ్యాధి సోకినట్లు పేర్కొన్నారు. వీరిని క్వారంటైన్ కోసం సురక్షిత ప్రదేశానికి తరలించేందుకు అమెరికా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఎబోలా వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. ఎబోలా వ్యాప్తిని జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం (ఎన్‌సీడీసీ) నిశితంగా గమనిస్తోందని, దేశంలోకి ఈ వ్యాధి ప్రవేశించ కుండా నిఘా పెట్టిందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో ఎబోలా వ్యాప్తి లేనప్పటికీ అంతర్జాతీయ ప్రయాణాలు, ప్రపంచ అనుసంధానం కారణంగా భారత్ అంటువ్యాధుల ముప్పు పట్ల అప్రమత్తంగా ఉండాలని దిల్లీలోని ఎయిమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సంజయ్ రాయ్ హెచ్చరించారు.

## పాలమూరు ప్రాజెక్టులపై బిఆర్ఎస్ మోసం

02

90శాతం పూర్తి చేశామని అబద్దాల ప్రచారం

గత ప్రభుత్వ నిర్లక్ష్యం అంతాఇంతా కాదు

మండిపడ్డ మంత్రి జూపల్లి కృష్ణారావు

# విజయ్ ప్రభుత్వం కుప్పకూలడం ఖాయం

- సొంత బలం లేకపోవడమే అతిపెద్ద బలహీనత
- తమిళనాడు మాజీ సిఎం స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు



**చెన్నై,మే19నేషనలిస్ట్ వాయిస్**

ప్రముఖ సినీ నటుడు విజయ్ నేతృత్వంలో కొత్తగా ఏర్పడిన టీవీకే ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చని డీఎంకే అధినేత, మాజీ సీఎం ఎం.కె. స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. విజయ్ ప్రభుత్వం పూర్తిస్థాయి మద్దతు లేక అస్థిరంగా ఉందని, ఎప్పుడైనా కూలిపోయే అవకాశం ఉన్నందున డీఎంకే శ్రేణులు ముందస్తు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. డీఎంకే కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ..ప్రస్తుత ప్రభుత్వం ఏక్షణమైనా కూలిపోవచ్చుఅని, డీఎంకే పార్టీ కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు.

వివరాలు 2లో



## మత్స్యకారుల సేవలో' పథకం కింద

# రూ.262 కోట్లు విడుదల

- మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండ
- మన తీరంలో మనదే బోటు..మనదే వేట
- పొరుగు రాష్ట్రాల మత్స్యకారులకు స్థానం లేదు
- సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టీకరణ

**నెల్లూరు,మే19నేషనలిస్ట్ వాయిస్**

మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మంగళవారం తుమ్మలపెంటలో 'మత్స్యకారుల సేవలో' పథకం కింద రూ.262 కోట్ల నిధులను సీఎం విడుదల చేశారు.



## వీలైనంత త్వరగా సేకరణ జరగాలని ఆదేశం

## ప్రజాప్రతినిధులతో ప్రాజెక్టులపై సిఎం రేవంత్ సమీక్ష

**హైదరాబాద్,మే19నేషనలిస్ట్ వాయిస్**

పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను దగ్గరుండి యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయించాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులు, ప్రజా ప్రతినిధులను ఆదేశించారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని సీఎం చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్డీలో సమావేశమయ్యారు.

## యుద్ధ ప్రాతిపదికన పాలమూరు - రంగారెడ్డి భూసేకరణ

# పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యం

### కెసిఆర్ హయాంలో జరిగిన తప్పులను సరిదిద్దుతాం

### అధికారులతో సమీక్షించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్,మే19నేషనలిస్ట్ వాయిస్**

పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దేవాదుల, ఎస్ఎల్‌బీసీ, సీతారామ ప్రాజెక్టులతో సమాన ప్రాధాన్యం ఇస్తామని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో పాలమూరు - రంగారెడ్డి పనులు 90శాతం పూర్తి అయ్యాయన్నది అసత్యమని అన్నారు. బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. భూసేకరణ లేకుండానే టెండర్లు పిలిచారని విమర్శించారు. మంగళవారం సచివాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. తెలిపారు. జూరాల అభివృద్ధికి ప్రతిపాదనలు చేశామని వివరించారు.



# మత్స్యకారుల సేవలో' పథకం కింద రూ.262 కోట్లు విడుదల

మొదటిపేజీ తరువాయి

అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. చరిత్రలో తొలిసారి రూ.262 కోట్లు మత్స్యకారుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. రూ.3,256 కోట్లతో 9 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. 'బోటూ మనదే.. వేటా మనదే' అని సీఎం అన్నారు. తీరం మనదే.. బోటు మనదే.. వేటా మనదే.. రాజీలేదు. ఎవరైనా వస్తే రానిచ్చే పరిస్థితి లేదు. భయపడేది లేదు. ఎవరి కోసమో మన జీవనోపాధి కోల్పోవడమేంటి? మన తీరంపై మనకే హక్కులుంటాయన్నారు. పొరుగు రాష్ట్రాలు రావడానికి లేదు. బోటు చొరబడగానే కలెక్టర్‌కు మెసేజ్ వస్తుంది. మెసేజ్ రాగానే అప్రమత్తమవుతాం.. ఎవరినీ రానివ్వం అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మత్స్యకారులకు ఎల్లప్పుడూ ఈ ప్రభుత్వం అండగా ఉంటుంది. వేట నిషేధ సమయంలో రూ.20 వేలు ఆర్థిక భరోసా ఇస్తున్నాం. చరిత్రలో తొలిసారిగా రూ.260 కోట్లు మత్స్యకారుల ఖాతాల్లో వేశాం. గతేడాది 1,21,433 కుటుంబాలకు రూ.243 కోట్ల సాయం అందించాం. ఇవాళ 1,30,796 కుటుంబాలకు రూ.262 కోట్ల ఆర్థిక సాయం అందించాం. 2014-19లో మత్స్యసంపద ఉత్పత్తి 19.18శాతం పెరిగింది. కానీ, వైకాపా హయాంలో నాలుగు రెట్లు పడిపోయింది. వ్యవసాయం, నిర్మాణ రంగం తర్వాత.. మత్స్య సంపదపైనే ఎక్కువ మంది ఆధారపడ్డారు. దేశంలో రొయ్యల ఉత్పత్తిలో 80శాతం ఏపీ నుంచే ప్రపంచానికి ఎగుమతి అవుతున్నాయి. సముద్రపు నీటితో సీవీడ్ కల్చర్ చేస్తే డబ్బులే.. డబ్బులు. మగవాళ్లు వేటకు వెళ్తే.. మహిళలు సీవీడ్ పండించాలి. మహిళలకు ఆదాయం పెంచే మార్గాలు సూచిస్తున్నా.. పాటించండి. మత్స్యకారుల జీవితాలు మెరుగుపడాలి. వారి జీవితాల్లో వెలుగు నింపే బాధ్యత ఈ ప్రభుత్వానిదని సీఎం అన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులకు ఇబ్బందులు ఉండవన్నారు. జువ్వలదిన్నె హార్బర్‌ను త్వరలో పూర్తి చేస్తామని వెల్లడించారు. 'జువ్వలదిన్నె హార్బర్ మీ సొంతం.. నకిలీ ప్రచారాలు నమ్మొద్దన్నారు. చేపలు తింటే డయాబెటిస్ రాదన్నారు. 'మీ చేపల ఉత్పత్తులకు మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తా' అని అన్నారు. 200 మెకనైజ్డ్ బోట్ల మంజూరుతో పాటు రాయితీ ఇస్తామన్నారు. ఆక్వాను ఎక్కువ చేయాలని సీఎం పేర్కొన్నారు. వైసీపీ హయాంలో మత్స్యకారుల సాయాన్ని రూపాయి కూడా పెంచలేదని సీఎం విమర్శించారు. 2019-24 మధ్య జగన్ విధ్వంసకర పాలన చేశారని మండిపడ్డారు. 18 నెలల్లో తిరుపతి నుంచి బుల్లెట్ వాహనాలు తయారీ మొదలవనుందని తెలిపారు. ప్రస్తుతం స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ మాట్లాడుతున్నట్లు వెల్లడించారు. టీడీపీ డీఎన్ఏలో బీసీలు ఉన్నారని.. మనది తిరుగులేని అనుబంధమని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. పరిశ్రమలు, అభివృద్ధిని గొడ్డలి పార్టీ ఓర్వలేకపోతోందన్నారు. సాగర్ డిఫెన్స్ ప్రాజెక్ట్‌పై దుష్ప్రచారం చేస్తోందని అన్నారు. సాగర్ డిఫెన్స్ ప్రాజెక్ట్‌లో స్థానికులకే ఉద్యోగాలు అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, ఫరూఖ్ తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# విజయ్ ప్రభుత్వం కుప్పకూలడం ఖాయం

సొంతంగా 107 సీట్లు సాధించిన టీవీకే మిత్రపక్షమైన కాంగ్రెస్ 5 సీట్లు, సీపీఐ 2, సీపీఎం 2, వీసీకే 2 సీట్లు సాధించిన డీఎంకే మిత్రపక్షాల మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతు ఇస్తున్న తమ మిత్రపక్షాలైన వీసీకే, సీపీఐ, సీపీఎం, ఐయూఎంఎల్ మద్దతు నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నా, లేదా తమిళనాడు స్పీకర్ గానీ, కోర్టులు గానీ రెబెల్ ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేలను చివరికి అనర్హులుగా ప్రకటించినా రాజకీయ అస్థిరత ఏర్పడవచ్చని పేర్కొన్నారు. గతంలో ఎన్నికల పరాజయాల నుండి డీఎంకే ఎలా పుంజుకుందో గుర్తు చేశారు. 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటు మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ ఓటమి తాత్కాలికమైందని, తాము మళ్లీ విజయం సాధిస్తామని కార్యకర్తలకు భరోసానిచ్చారు. తమిళనాడులో సూర్యుడు (డీఎంకే గుర్తు) ఎప్పటికీ అస్తమించడు' అని స్టాలిన్ స్పష్టం చేశారు. ఓటమికి వ్యక్తిగత బాధ్యత తీసుకుంటానని, సోషల్ మీడియాలో పార్టీపై వచ్చే విమర్శలను తిప్పికొట్టాలన్నారు. ఈ విషయంలో టీవీకే చాలా ముందుందని పరోక్షంగా సూచించారు. ఒకప్పుడు మనం టీ దుకాణాల్లో మాట్లాడిన రాజకీయాలను ఇప్పుడు సోషల్ మీడియా వేదికలపై మాట్లాడాలని సూచించారు.

మొదటిపేజీ తరువాయి

# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

**హైదరాబాద్,మే19నేషనలిస్ట్ వాయిస్**

తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రత కోసం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కొత్తగా ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కొత్త హెల్త్ స్కీమ్ అమల్లో భాగంగా రాష్ట్ర ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ అన్ని ప్రభుత్వ శాఖలకు అత్యవసర ఆదేశాలు జారీ చేసింది. ఈ పథకం ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు వైద్య భద్రత కల్పించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది. ఉద్యోగుల ఆరోగ్య సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ట్రస్ట్ ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉద్యోగుల పూర్తి సమాచారాన్ని సేకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించింది. ఫైనాన్స్ శాఖ సూచనల ప్రకారం ప్రతి ఉద్యోగి, పెన్షనర్ తమ కుటుంబ సభ్యుల వివరాలతో సహా పూర్తి డేటాను తప్పనిసరిగా సమర్పించాలి. భార్య, భర్త, పిల్లలు, ఆధారపడిన కుటుంబ సభ్యుల వివరాలు కూడా నమోదు చేయాలని స్పష్టం చేసింది. ఈ సమాచారం భవిష్యత్తులో ఆరోగ్య సేవలు, క్యాష్‌లెస్ చికిత్స వంటి ప్రయోజనాల అమలుకు ఉపయోగ పడనుంది. అన్ని శాఖల అధికారులు ఉద్యోగుల వివరాలను పోర్టల్‌లో మే 31వ తేదీలోపు అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. నిర్ణీత గడువులోపు సమాచారం నమోదు చేయని పక్షంలో భవిష్యత్తులో ఆరోగ్య పథకాల ప్రయోజనాలు పొందడంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

# నాల్గవ డివిజన్లో సమస్యలు పరిష్కరించిన మాజీ కార్పొరేటర్ జ్యోతి రెడ్డి



**ఖమ్మం బ్యూరో నేషనలిస్ట్ వాయిస్ మే 19**

4 వ డివిజన్ లోని పాండురంగాపురం గవర్నమెంటు స్కూల్ సమీపంలో బజార్ ఆబ్కర్ కాలనీ లో నివసిస్తున్న బి వెంకటేశ్వర్లు మరియు ప్రజల విన్నపం మేరకు రోడ్ల వెంబడి ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి కాలువ లు శుభ్రం చేయడం జరిగింది తెలిపిన వెంటనే స్పందించి కమిషనర్ వెంటనే గ్యాంగ్ సిబ్బంది ని పంపిన నారు శానిటరీ ఇన్స్పెక్టర్ షేక్ బాబు కి జవాన్ ,బుర్రి వెంకటేశ్వర్లు కి,నాగుబాయి కి పని చేసిన మున్సిపల్ సిబ్బందికి కృతజ్ఞతలు ధన్యవాదాలు అభి నందనలు. ప్రగతి కోసం ఐక్యత "కలిసి ఎదుగుదాం, కలిసి నిర్మిద్దాం."ప్రజల గళం "మీ గళం, మీ శక్తి, మీ భవిష్యత్తు.'మార్పు ఇక్కడే మొదలవుతుంది "ఈనాటి ఒక అడుగు, రేపటి మెరుగైన భవిష్యత్తు." – న్యాయం మరియు సమానత్వం "అందరికీ న్యాయం, ఐక్యతలో బలం."– భవిష్యత్తు మన చేతుల్లోనే "కార్యాచరణకు పూనుకునే వారిదే భవిష్యత్తు. మీ నాలుగో డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి (అయ్యప్ప రెడ్డి)గౌరవ సలహాదారులు, వ్యవస్థాపకుడు, మాజీ చైర్మన్, మాజీ అధ్యక్షుడు, మాజీజా:సెక్రటరీ.స్వయంభు శ్రీ అభయ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మన 4 వ డివిజన్ చౌకీదార్ అభివృద్ధి కోసం సమస్య లు పరిష్కారానికి ఇరవై నాలుగు గంటలు అందుబాటులో ఉంటూ మీరు అభిమానించే నాయకుడి గా సేవలు అందిస్తూ మానవసేవ,మాధవసేవ జీవితాన్ని అంకితం చేస్తున్న తాజా మాజీ కార్పొరేటర్ ప్రజల తో మీ దండా జ్యోతిరెడ్డి (అయ్యప్ప రెడ్డి) బీ ఆర్ ఎస్ పార్టీ 4 వ డివిజన్ ఖమ్మం. సెల్ 8332912222.,9866925591.

# డిపిఓ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శిని విచారించిన మండల పంచాయతీ అధికారి

**నేషనలిస్ట్ వాయిస్ మల్లాపూర్ మే19**

మండలంలోని మొగిలిపేట గ్రామపంచాయతీ పరిధిలో గత పాలకవర్గం ఆధ్వర్యంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించి ఎంబి రికార్డులు తీసుకొని రిసీవ్డ్ ఇవ్వాలని సంబంధిత అధికారులు ఆదేశించినప్పటికీ ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతారు చేస్తూ ప్రస్తుత సర్పంచు కుటుంబ సభ్యుల జోక్యం వల్ల ఎంబీ రికార్డులు తీసుకోలేకపోతున్నానని పంచాయతీ కార్యదర్శి తెలిపారని, జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేయడంతో డిపిఓ ఆదేశం మేరకు ఎంపీఓ జగదీష్ విచారణ జరిపారు. గ్రామపంచాయతీలో రికార్డులు భద్రపరిచి మాజీ సర్పంచ్ నాగరాజుకు రిసీవ్డ్ కాపీ ఇచ్చి విడతలవారీగా బిల్లులు చెల్లించాలని అన్నారు.ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతరు చేసిన కార్యదర్శి మరియు రికార్డుల నిర్వహణలో గ్రామపంచాయతీ పరిపాలనలో ప్రస్తుత సర్పంచ్ కుటుంబ సభ్యుల జోక్యం పై ఫిర్యాదు విచారణ గూర్చి ఎంపీఓను వివరణ కోరగా మాజీ సర్పంచ్ నాగరాజు చేసిన ఫిర్యాదు పై విచారణ జరిపామని ఇట్టి విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు.

# ఆసుపత్రి నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

**- మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్**

**- త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి**

**పెబ్బేరు మే19 నేషనలిస్ట్ వాయిస్**

పట్టణ ప్రజలకు మెరుగైన, కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య సేవలను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. భవన నిర్మాణంలో జరుగుతున్న పనుల పురోగతిని, గదుల నిర్మాణ శైలిని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ... పేద ప్రజలకు అధునాతన వైద్య సేవలు మరింత చేరువ చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ 30 పడకల ఆసుపత్రిని మంజూరు చేసిందని గుర్తుచేశారు.నిర్మాణ పనుల్లో ఎక్కడా రాజీ పడకుండా, పూర్తి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. నిర్ణీత కాలవ్యవధిలోగా పనులన్నీ పూర్తి చేసి, భవనాన్ని ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడు, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, బుర్రమోని రాములు యాదవ్, రణధీర్ రెడ్డి, విష్ణువర్ధన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



# పాలమూరు ప్రాజెక్టులపై బిఆర్ఎస్ మోసం

**హైదరాబాద్,మే19నేషనలిస్ట్ వాయిస్**

బీఆర్ఎస్ నేతలకు పాలమూరు ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతిక అర్హత లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. 2015లో అప్పటి సీఎం కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని... రెండేళ్లలో పూర్తి చేస్తామన్నారని గుర్తు చేశారు. లక్ష కోట్ల ప్రాజెక్టును పదేళ్లలో రూ.25 వేల కోట్లు మాత్రమే ఖర్చు పెడితే 90 శాతం ఎలా పూర్తి అయినట్లు అని ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టు

మొదటిపేజీ తరువాయి

తర్వాత మొదలుపెట్టిన కాళేశ్వరం ప్రాజెక్టును లక్ష కోట్లు ఖర్చు చేసి ఎలా పూర్తి చేశారని నిలదీశారు. పాలమూరు ప్రాజెక్టులపై గత ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వహించిందని విమర్శించారు. గట్టు, కల్వకుర్తి, జూరాల, కోయిల్ సాగర్, భీమా అన్ని ప్రాజెక్టుల విషయంలో పక్షపాతం చూపారని మంత్రి మండిపడ్డారు. కల్వకుర్తి పంపులు బాగు చేయలేకపోయారన్నారు. పాలమూరు ప్రాజెక్టు నీటి కేటాయింపులు సాధించలేకపోయారని తెలిపారు. కృష్ణా నీటిని పదేళ్లు ఏపీకి తాకట్టు పెట్టారని ఆరోపించారు. రాయలసీమను రతనాల సీమ చేస్తామని చెప్పింది బీఆర్ఎస్ కాదా అని ప్రశ్నించారు. గద్వాల్‌లోని ర్యాలంపాడు రిజర్వాయర్‌ను పదేళ్లలో రిస్టోర్ చేయలేదన్నారు.

# ఇదేందయ్యా రాములా..? - మరీ ఇంత దారుణమా

**- న్యాయం కోసం వెళ్లిన వివాహితను గర్భవతిని చేసిన ఖమ్మం సీఐ**

**భర్తపై ఫిర్యాదుకు వచ్చిన మహిళను లోబర్చుకున్న సీఐ రాజు నాయక్**

**పెళ్లి పేరుతో గర్భవతిని చేసి, బలవంతంగా అబార్షన్ చేయించిన వైనం**

**బాధితురాలి ఫిర్యాదుతో సీఐపై కేసు నమోదు, ముందస్తు బెయిల్**

**విచారణలో ఆరోపణలు నిజమేనని తేలడంతో డీజీపీ ఆఫీస్‌కు అటాచ్**

**ఖమ్మం బ్యూరో నేషనలిస్ట్ వాయిస్ మే 19**



2023లో ఖమ్మం మహిళా పోలీస్ స్టేషన్‌లో రాజు నాయక్ సీఐగా ఉండగా ఓ మహిళ తన భర్త వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు నుంచి ఫోన్ నంబర్ తీసుకున్న సీఐ, న్యాయం చేస్తానని నమ్మించి తరచూ ఫోన్లు, మెసేజ్‌లు చేయడం ప్రారంభించాడు. అనంతరం పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి ఆమెను లోబర్చుకున్నాడు. ఈ క్రమంలో బాధితురాలు గర్భం దాల్చడంతో తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసింది. అయితే, సీఐ ఆమెకు బలవంతంగా కొన్ని ట్యాబ్లెట్లు మింగించడంతో గర్భస్రావం అయిందని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. ఆ తర్వాత కూడా పెళ్లి విషయాన్ని దాటవేస్తుండటంతో విసిగిపోయిన ఆమె ఈ నెల 7న ఖమ్మం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు కావడంతో సీఐ రాజు నాయక్ పరారీలోకి వెళ్లి, ఇటీవల ముందస్త

మొదటిపేజీ తరువాయి

# భూసార ఆరోగ్య పరిరక్షణలో శ్రద్ధ అవసరం

ఈ నేపథ్యంలో నిర్వహించిన రైతు నేస్తం 92వ ఎపిసోడ్ కార్యక్రమంలో రాష్ట్రంలోని సుమారు 1,600 వేదికల ద్వారా వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యంతో రైతులు, వ్యవసాయ అధికారులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి కే. సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి, ఉద్యానవన శాఖ సంచాలకులు యాస్మిన్ భాష, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు, జిప్సం ఎరువులు పంపిణీ చేసారు. అనంతరం పచ్చిరొట్ట పంటల సాగు, జిప్సం వాడకం ద్వారా భూసార ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి రైతులకు సాంకేతిక వివరాలు తెలియజేశారు. ఓార్యక్రమంలో భాగంగా వృత్తిరీత్యా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయినప్పటికీ వ్యవసాయంపై ఆసక్తితో ఆయిల్‌పామ్ సాగు చేస్తూ మంచి లాభాలు పొందుతున్న ఖమ్మం జిల్లా రఘునాథపల్లి రైతు మహేష్ తన అనుభవాలను వివరించారు.

# పెట్టుబడి దారీ దోపిడీ వ్యవస్థను కూల్చి సమసమాజం సాధించడమే సుందరయ్యకు ఘనమైన నివాళి

**- సిపిఎం వనపర్తి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మండ్ల రాజు**

**పెబ్బేరు మే19 నేషనలిస్ట్ వాయిస్**

సిపిఎం పార్టీ నిర్మత పుచ్చల పల్లి సుందరయ్య 41వ వర్ధంతి నీ సిపిఎం పెబ్బేరు మండల కమిటీ ఆధ్వర్యంలో హమాలీ సంఘం కార్యాలయంలో సిపిఎం నాయకులు ఆర్ భాస్కర్ అధ్యక్షతన నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మండ్ల రాజు పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మండ్ల రాజు మాట్లాడుతూ , పుచ్చలపల్లి సుందరయ్య 1913 మే 1న నెల్లూరు జిల్లా అలగానిపాడులో భూస్వామ్య కుటుంబంలో జన్మించారని భూస్వామ్య వ్యవస్థ రద్దు కోసం, దోపిడి రాజ్యం పెట్టుబడిదారీ సమాజం రద్దు కోసం పనిచేశారని అన్నారు. సోషలిజం స్థాపనకు ఎనలేని కృషి చేశారన్నారు. 1985 మే 19న అనారోగ్యంతో మరణించారన్నారు ఆయన జీవించినంత కాలం నిరాడం వరకు నిరాడంబరతకు పెట్టింది పేరని పార్లమెంటు ప్రతిపక్ష నాయకుడిగా 1952 నుండి 1954 వరకు, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో 17 సంవత్సరాలు శాసనసభ్యులుగా పని చేశారని తను సైకిల్ పైనే ప్రయాణం చేసే వార నీ కొనియాడారు. కుల వివక్ష అంతం కోసం కుటుంబంతోనే పోరాటం ప్రారంభించి సమాజంలో అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమిచారన్నారు. 1932 లోనే అలగానిపాడు లో వ్యవసాయ కార్మిక సంఘం స్థాపించారన్నారు. కార్మికులను, పేదలను దోపిడీకి గురిచేస్తున్న పెట్టుబడి దారి వ్యవస్థను కూల్చి సోషలిజం స్థాపించడమే సుందరయ్య గారికీ ఘనమైన నివాళి అని అన్నారు. భారత దేశంలో సంపద కొంతమంది దగ్గర పోగుబడుతున్నది. 90శాతం మంది పేదలుగా, నిరుపేదలుగా జీవనం కొనసాగిస్తున్నారు. నిరుద్యోగ సైన్యం పెంచి పోషించే వ్యవస్థ పెట్టుబడి దారి వ్యవస్థ అన్నారు. మహిళాలను ఆటబొమ్మలుగా చూయించేది, అత్యాచారాలు జరగడం సహజమే అనే ధోరణి ఈ వ్యవస్థలో ఉన్నదన్నారు. కులం, మతం మతం పేరుతో సమాజాన్ని నిలువున చీల్చింది పెట్టుబడి దారి వ్యవస్థ అని మండి పడ్డారు . పెట్రోల్ ,డీజిల్ ,ఆదాచేయండి ,బంగారం కొనుగోలు చేయకండి అంటూ స్వయానా ప్రధాని ప్రచారం చేయడం వెనుక దాగివున్న ఉన్న అసలు రహస్యం సంక్షోభమే అన్నారు. పెట్టుబడి దారి వ్యవస్థ ఆర్థిక అసమానతలు, సామజిక, రాజకీయ అసమానతలు పెంచి పోషించే దుర్మార్గపు వ్యవస్థ అన్నారు . ఈ వ్యవస్థ మార్పుకోసం నేటి యువత, కార్మిక వర్గం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలనీ ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఊసన్న హమాలి యూనియన్ అధ్యక్షులు ఆంజనేయులు, గంగాధర్, వెంకటేష్, రాజు, నరసింహ, బిసన్న తదితరులు పాల్గొన్నారు.



మొదటిపేజీ తరువాయి

# యుద్ధ ప్రాతిపదికన పాలమూరు -రంగారెడ్డి భూసేకరణ

ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి సీఎం కీలక సూచనలు చేశారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ భేటీలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాకేశ్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 19 నేషనలిస్ట్ వాయిస్):**

వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని హాజీపూర్ మండలం సబ్బపల్లి లోని గోదాము, నస్పూర్ మండల కేంద్రంలోని గోదాము, లక్షెట్టిపేట మండలం గుల్లకోట లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రం, వెంకట్రావుపేట లోని గోదాము, లక్ష్మీపూర్ లలో గల రైస్ మిల్లులను మండల తహశీల్దార్ దిలీప్ కుమార్, దండేపల్లి మండలం కన్నేపల్లిలో గల రైస్ మిల్లును మండల తహశీల్దార్ రోహిత్ దేశ్ పాండే, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్ లతో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు, నిల్వ, తరలింపు ప్రక్రియలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా త్రాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు ఇతర సదుపాయాలు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని, కొనుగోలు కేంద్రాల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలని తెలిపారు. రైస్ మిల్లుల నిర్వాహకులు కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని, ఇందుకు అవసరమైన హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన నిర్దేశిత లక్ష్యాలను పూర్తిస్థాయిలో త్వరగా సాధించే విధంగా అధికారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. లారీల యజమానులు ధాన్యం తరలింపులో నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని తెలిపారు. గోదాములకు తరలించిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం నిల్వ చేయాలని, తదుపరి ఆదేశాల ప్రకారం తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని వినతి

**చేగుంట మే 19( నేషనలిస్ట్ వాయిస్ రిపోర్టర్ )**

తండాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎంపీ రఘునందన్ రావుకు జైత్రం తండా సర్పంచి సుభాష్ నాయక్ వినతి పత్రం అందజేశారు సోమవారం పాలకవర్గ సభ్యులతో కలిసి హైదరాబాద్ లో ఎంపీ ని కలిశారు





# ధాన్యం కొనుగోలు పారదర్శకంగా చేపట్టాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య





**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 19 నేషనలిస్ట్ వాయిస్):**

రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య తెలిపారు. మంగళవారం జిల్లాలోని జైపూర్ మండలం టేకుమట్ల, షెట్ పల్లి, కుందారం, గంగిపల్లి గ్రామపంచాయతీలను పర్యటించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి హామీ, పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య మాట్లాడుతూ, జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. టేకుమట్లలో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా అవసరమైన లారీలను వెంటనే సమకూర్చాలని సంబంధిత రవాణా కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం త్వరితగతిన కొనుగోలు చేసి మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో పారిశుధ్య ప్రక్రియ నిరంతరం కొనసాగించాలని, చెత్త సేకరణ సమయానికి నిర్వహించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి నిర్దేశిత విస్తీర్ణంలో ఇంటి నిర్మాణ పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని, ఆ దిశగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. షెట్‌పల్లి వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, హమాలీలు, లారీల సమన్వయంతో ధాన్యం తరలింపును వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు కుందారం గ్రామంలోని ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించి కార్మికులతో మాట్లాడారు. పనులు నాణ్యతతో చేపట్టడంతో పాటు కార్మికులకు సమయానికి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒక మహిళ తన భర్త మరణించడంతో ఉపాధి హామీ పథకం కూలి డబ్బులు బ్యాంక్ ఖాతాలో నిలిచిపోయాయని, ఇప్పించాలని కోరగా వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, మండల పంచాయతీ అధికారి బాపు లను ఆదేశించారు. గంగిపల్లి గ్రామపంచాయతీని సందర్శించి పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. గ్రామంలో అంతర్గత రహదారులు, మురుగు కాలువల శుభ్రత, చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి అధికారులకు పలు సూచనలు. చేశారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి ధర్మారాణి, ఏపీఎం సంతోష్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్ లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ ఫామ్ సాగు పై అవగాహన

**చేగుంట మే 19**

చేగుంట మండలం మక్క రాజు పెట్ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు, ఈ సదస్సులో లీవ్ ఫామ్ రిసో రెస్ ప్రైవేట్ లిమిటెడ్ టెక్నికల్ డైరెక్టర్ శ్రీయగా శ్రీ రంగనాయకులు ముఖ్య ప్రసంగం చేశారు, ఆయిల్ ఫామ్ సాగు ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని, అడవి పందుల బారి నుంచి కూడా పంట రక్షణ లభిస్తుందని ని ఆయన వివరించారు



# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

**చేగుంట మే 19( నేషనలిస్ట్ వాయిస్ర్ )**

చేగుంట మండలం పోలంపల్లి గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ త్రివేణి మాట్లాడుతూ లెగ్యుమ్ జాతి అపరాలు నూనె గింజలతో పంట మార్పిడి పాటించాలని సాగునీటి పొదుపు సేంద్రియ పద్ధతులపై రైతుల అవగాహన కల్పించారు, ఈ కార్యక్రమంలో డాక్టర్ రాకేష్, ఏ వో హరిప్రసాద్ రైతులు పాల్గొన్నారు




# వర్ష సూచనల నేపథ్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాల్లో అప్రమత్త చర్యలు

## తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి

**తూప్రాన్, మే 19 నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో వర్ష సూచనలు ఉన్న నేపథ్యంలో వడ్ల కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. కొనుగోలు కేంద్రాలలో నిల్వ ఉంచిన ధాన్యం తడవకుండా కవర్లు, తార్పులు (టార్పాలిన్లు) ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే రైతులు కూడా తమ వడ్లను సురక్షితంగా నిల్వ ఉంచుకుని, వర్షాల కారణంగా నష్టం కలగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తూ, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వడ్ల కొనుగోలు ప్రక్రియను సజావుగా కొనసాగించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇదిలా ఉండగా, రానున్న 24 గంటల్లో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన ఉరుములు, మెరుపులతో కూడిన వేడిగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, శంషాబాద్ ప్రాంతాలతో పాటు సిద్దిపేట జిల్లా గజ్వేల్, మెదక్ జిల్లా మనోహరాబాద్, తూప్రాన్, నారాయణపేట జిల్లాల్లో వాతావరణ ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని పేర్కొంది.ప్రజలు, రైతులు వాతావరణ సూచనలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఇతర ప్రాంతాల్లో పొడి వాతావరణం కొనసాగే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది.











# చిన్న శంకరంపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడుగా హలవత్ మోహన్ నాయక్ నియామకం

**చిన్న శంకరంపేట్ మే,19 నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి)**



చిన్న శంకరంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా కామారం తాండ గ్రామ సర్పంచి హలవత్ మోహన్ నాయక్ మంగళవారం నియామకమయ్యారు డిసిసి అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ అధికారికంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ప్రకటించారు. ఈ సందర్భంగా మోహన్ నాయక్ మాట్లాడుతూ... మెదక్ ఎమ్మెల్యే రోహిత్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, సీనియర్ నాయకుల సహకారంతో అధ్యక్షులుగా నియమించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చిన్న శంకరంపేట మండల నాయకులు సర్పంచులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమన్వయంతో పనిచేస్తానని పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని వారు తెలిపారు.

# మార్కెట్ కమిటీ సర్వసభ్య సమావేశం

**చేగుంట మే 19,( నేషనలిస్ట్ వాయిస్ రిపోర్ట్)**

మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం చేగుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సాధారణ సమావేశం చైర్మన్ తాడెం వెంగల్ రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఉష్ గత 3 నెలలకు సంబంధించిన ఆదాయ,వ్యయాలకు సంబంధించిన వివరాలను పాలకవర్గం సభ్యులకు చదివి వినిపించారు.అనంతరం సభ్యులందరూ అభివృద్ధి పనులు, పలు అంశాలపై ఏకగ్రీవంగాతీర్మానాలు చేసి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడతూ కొనుగోలు కేంద్ర ల లో ఎలాంటి సమస్య ఉన్న చైర్మన్ కి గాని, డైరెక్టర్ లకు సంప్రదించాలని రైతులు ఎవరు అధైర్య పడకూడదని, ప్రతి గింజను ప్రభుత్వం కొంటుందని, అన్నారు, సమావేశంలో డైరెక్టర్లు ఎత్తిన పలు సమస్యలపై వెంటనే సంబంధిత స్థానిక తాసిల్దార్, ఎంపీడీవో తో మాట్లాడడం జరిగింది, అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ మార్కెట్ కమిటీ కార్యాలయనికి కొత్తగా 25 కాంటాలు వచ్చినాయని,అవుసరం ఉన్న వారు (వి ఏ ఓ లు )వచ్చి, పాతవి ఇచ్చి కొత్తవి తీసుకుగలరని అన్నారు ఈ సమాబవేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మొహమ్మద్ ముజామిల్, స్టాలిన్ నర్సిములు, అన్నం ఆంజనేయులు, కాషాబోయిన శ్రీనివాస్, మొహమ్మద్ రఫీ, శ్రీధర్ రెడ్డి, పక్కిర్ నాయక్, కుర్మ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



# సమ్మెకు మద్దతు ఇవ్వాలని ఎస్ఐకి వినతి ఇచ్చిన వివోఏలు

**చేగుంట మే 19( నేషనలిస్ట్ వాయిస్ రిపోర్టర్ )**

రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, వివోఏ ల రాష్ట్ర కమిటీ మేరకు మే 20 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవదిక సమ్మె చేపట్టినట్లు చేగుంట వివోఏ ల సంఘం సభ్యులు ప్రకటించారు మంగళవారం స్థానిక ఎస్ ఐ చైతన్య కుమార్ కి కలిసి సమ్మె నోటీస్ అందజేశారు. తమకు మద్దతు ఇవ్వాలని అన్నారు,ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న విఓఏ లకు : కనీస వేతనం 20000వేలకు పెంచాలని.ఆరోగ్య హెల్త్ పాలసీ , పదోన్నతులు ఆరోగ్య బీమా, ట్యాబ్ స్వాకర్యం కల్పించాలని విన్నవించారు .న్యాయమైన డిమాండ్ లు తీర్చాక పోతే వెనక్కి తగ్గేది లేదని తెలిపారు ఈ కార్యక్రమం లో అవుబోతు స్వామి, భానుప్రయ్, కవిత, హారిక, అరుణ, పద్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు



# సీఎం రిలీఫ్ చెక్కులు అందజేసిన మార్కెట్ కమిటీ చైర్మన్ తాడెం వెంగల్ రావు

**చేగుంట మే 19 ( నేషనలిస్ట్ వాయిస్ రిపోర్టర్ )**

నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ ఒక వరమని మార్కెట్ కమిటీ చైర్మన్ తాడెం వెంగల్ రావు,చేగుంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్ అన్నారు. మంగళవారం చేగుంట మండలం చిన్న శివనూరు గ్రామానికి చెందిన బొల్ల మహేష్ కు రూ.60,000రూపాయలు, వల్లభపూర్ గ్రామానికి చెందిన, బత్తుల కొమరయ్య కు 15000 రూపాయలు, విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సి హెచ్ శ్రీనివాస్ రెడ్డి అదేశాల మేరకు వారి కుమారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బొల్ల ప్రశాంత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం దిగుమతికి సరిపడా హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు





**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 19 నేషనలిస్ట్ వాయిస్):**

జిల్లాలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు చేసిన వరి ధాన్యం దిగుమతికి సరిపడా హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు తెలిపారు. మంగళవారం జిల్లాలోని మందమర్రి మండలం అందుగులపేట లో గల అంబికా సాయి రైస్ మిల్లు, హాజీపూర్ మండలం నర్సింగాపూర్ లో గల రాజరాజేశ్వరి గోదాము, కాసిపేట మండలంలోని ఏఎంసి గోదాములను ఆయా మండలాల తహశీల్దార్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు మాట్లాడుతూ, జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిబంధనల ప్రకారం చేపట్టడం జరుగుతుందని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులు, గోదాములకు తరలించడం జరుగుతుందని తెలిపారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో ధాన్యం తరలింపునకు సరిపడా లారీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. రైస్ మిల్లులు, గోదాముల వద్ద ధాన్యం దిగుమతికి వేచి ఉన్న లారీల నుంచి వరి ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని, అందుకు అనుగుణంగా హమాలీల సంఖ్య పెంచుకోవాలని తెలిపారు. ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం చేసి జిల్లాలో కొనుగోలు ప్రక్రియను ఎలాంటి ఆటంకం లేకుండా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం దిగుమతి వేగంగా చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 19 నేషనలిస్ట్ వాయిస్):**

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసి గోదాములు, రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని, ఈ క్రమంలో ధాన్యం దిగుమతి వేగంగా చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని జైపూర్ మండలం ఇందారం లో గల సుముఖ గోదాము, జయలక్ష్మి రైస్ మిల్ లను మండల తహశీల్దార్ వనజా రెడ్డి తో కలిసి సందర్శించి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం మద్దతు ధర చెల్లించి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా గోదాములు, రైస్ మిల్లులకు కేటాయించిన ప్రకారం తరలించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో లారీల నుండి ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని, అవసరం మేరకు హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని, రోజుకు 10 నుండి 15 లారీలు దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైస్ మిల్లర్లు సిఎంఆర్ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని, కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసే విధంగా అధికారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి

## వరి కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ వెంకట చారి పరిశీలన

**దోమ నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి మే 19**



దోమ : వికారాబాద్ జిల్లా దోమ గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని ఈరోజు వెంకట చారి , అదనపు కలెక్టర్ (రెవెన్యూ), వికారాబాద్ జిల్లా సందర్శించి కొనుగోలు కార్యకలాపాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) గ్యామా కూడా పాల్గొన్నారు.అధికారులు కేంద్రంలోని వరి నిల్వలు, కొనుగోలు ప్రక్రియ, తూకం విధానం, నిల్వ సదుపాయాలు, రికార్డుల నిర్వహణతో పాటు కేంద్రం పనితీరును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం రైతులు, సిబ్బంది మరియు సంబంధిత అధికారులతో మాట్లాడి కొనుగోలు ప్రక్రియ అమలు తీరును సమీక్షించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ సూచించారు. అలాగే కేంద్రంలో రైతులకు అందిస్తున్న సౌకర్యాలపై పలు సూచనలు చేశారు.ప్రస్తుత వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతుల సంక్షేమం కోసం రైతులందరికీ తల టోపీలు (హెడ్ క్యాప్స్) పంపిణీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా పి పి సి సూపర్వైజర్ మరియు వ్యవసాయ విస్తరణ అధికారి శ్రవణ్ కుమార్ తో కొనుగోలు కేంద్రం పనితీరుపై అధికారులు చర్చించారు. వరి రాక, కొనుగోలు ఏర్పాట్లు, రికార్డుల నిర్వహణ, రైతులకు అందిస్తున్న సౌకర్యాలు మరియు కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నర్సిములు , ఇతర సంబంధిత అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎపిలో వెయ్యి మినీ మార్టులు

## తక్కువ ధరలకే సరుకులు అందచేస్తాం

## పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

న్యూఢిల్లీ,మే19 నేషనలిస్ట్ వాయిస్)

రాబోయే రోజుల్లో ఏపీలో వెయ్యి మినీ మార్టులు ఏర్పాటు చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రెండో రోజు ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రానికి చెందిన పలు కీలక అంశాలపై వారితో చర్చించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.మినీ మార్టుల ద్వారా మిల్లెట్స్ కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని మనోహర్ తెలిపారు. మినీ మార్టులలో మార్కెట్ ధరల కంటే తక్కువకు నాణ్యమైన సరకులు అందజేస్తామన్నారు. మరోవైపు.. అరకు కాఫీని దేశవ్యాప్తంగా అన్ని మిలిటరీ క్యాంటీన్లలో ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారని మంత్రి వివరించారు.





# ఎబోలా అరికట్టే చర్యలు బలోపేతం

## - ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే వారిపై ఆంక్షలు

## - వీసాలను తాత్కాలికంగా నిలిపివేసిన అమెరికా

వాషింగ్టన్,మే19 నేషనలిస్ట్ వాయిస్)

ఎబోలా వ్యాప్తిని నివారించడానికి ముందుజాగ్రత్త చర్యలను బలోపేతం చేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. దీనిలో భాగంగా వ్యాధి వ్యాప్తి చెందిన ఆఫ్రికా ప్రాంతాల నుండి వచ్చే విమాన ప్రయాణికులను పరీక్షించడంతో పాటు, వీసాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా రాయబార కార్యాలయం వెల్లడించింది. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (డి ఆర్ సి) లో ప్రాణాంతకమైన ఎబోలా వ్యాప్తిని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యు హెచ్ ఒ) అత్యవసర పరిస్థితిగా ప్రకటించిన నేపథ్యంలో, యుఎస్ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సిడిసి) ఈ నివారణ చర్యలను చేపట్టింది. విమానాశ్రయాలలో స్క్రీనింగ్‌తో పాటు, గత 21 రోజులలోపు ఉగాండా, డి ఆర్ సి, దక్షిణ సూడాన్‌లకు ప్రయాణించిన అమెరికా యేతర పాస్‌పోర్ట్ హోల్డర్లపై ప్రవేశ ఆంక్షలను అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఉగాండాలోని కంపాలాలో ఉన్న అమెరికా రాయబార కార్యాలయం అన్ని వీసా సేవలను తాత్కాలికంగా నిలిపివేసి, ప్రభావితమైన దరఖాస్తుదారులకు సమాచారం అందించింది. డి ఆర్ సి లో ఉన్న ఒక అమెరికన్ సిబ్బందికి ఎబోలా వైరస్ సోకినట్లు డబ్ల్యుహెచ్ ఒ ప్రతినిధి సతీష్ పిళ్ళై ధృవీకరించారు. ఆ వ్యక్తికి పరీక్షల్లో పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో, చికిత్స నిమిత్తం జర్మనీకి తరలించేందుకు యత్నిస్తున్నామని అన్నారు. అలాగే అతనితో పరిచయం ఉన్న మరో ఆరుగురిని క్వారంటైన్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రజలకు తక్షణ ప్రమాదం తక్కువగానే ఉందని అంచనా వేస్తున్నామని, అయితే మారుతున్న పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తున్నట్లు సిడిసి తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ వ్యాధి వ్యాప్తిపై ఆందోళన వ్యక్తం చేస్తూనే, ప్రస్తుతానికి ఇది ఆఫ్రికాకే పరిమితమైందని తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఈ ఎబోలా సంక్షోభంపై ట్రంప్ ప్రభుత్వం స్పందిస్తున్న తీరుపై అంతర్జాతీయంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ ఒ) నుండి అధికారికంగా వైదొలగడం, గతంలో ఎబోలా నివారణలో కీలక పాత్ర పోషించిన 'యుఎస్ ఎఐడి' (యుఎస్ ఎఐడి) నిధులలో కోత విధించడం ప్రస్తుత నియంత్రణ ప్రయత్నాలపై ప్రతికూల ప్రభావం చూపిందనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం తీసుకుంటున్న ప్రయాణ నిషేధాలు కేవలం నాటకమేనని, ట్రంప్ ప్రభుత్వం ఈ విషయంలో చాలా వెనుకబడి వ్యవహరిస్తోందని జార్జ్‌టౌన్ యూనివర్శిటీ నిపుణులు మాథ్యూ కావనాగ్ విమర్శించారు. గతంలో ప్రభుత్వ ఏజెన్సీల సమన్వయం వల్ల వ్యాధిని వేగంగా అరికట్టగలిగారని, కానీ ఇప్పుడు వందలాది కేసులు నమోదై, తీవ్రంగా వ్యాపించిన తర్వాతే చర్యలు చేపట్టడం అమెరికా వ్యూహాత్మక వైఫల్యమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తాము స్థానిక ఆరోగ్య సంస్థలతో కలిసి పనిచేస్తున్నామని, తక్షణ ప్రతిస్పందన చర్యల కోసం 13 మిలియన్ డాలర్ల సహాయాన్ని సమీకరించినట్లు సిడిసి ప్రకటించింది.

# టిడిపికి అండగా మత్స్యకారులు

## అబద్ధాలు చెప్పం...ప్రచారాలు చేసుకోం

## వ్యవసాయశ్శాఖ మంత్రి అచ్చన్నాయుడు

నెల్లూరు,మే19 నేషనలిస్ట్ వాయిస్)

టీడీపీ స్థాపించిన నాటి నుంచి పార్టీకి, ఎన్టీఆర్, చంద్రబాబుకి ఎన్నెన్నో కష్టాలు వచ్చాయని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం ఇక్కడ మాట్లాడుతూ.. మత్స్యకారులు కుటుంబ సభ్యుల్లా పార్టీతో ఉన్నారని తెలిపారు. టీడీపీ అబద్ధాలు చెప్పదని... ప్రచారాలు చేసుకోదన్నారు. ప్రజలకు ఏమి కావాలో అదే చేస్తుందని స్పష్టం చేశారు. 2014 – 2019 రాష్ట్రానికి, మత్స్యకారులకి స్వర్ణయుగమన్నారు. 2019 ఎన్నికల్లో ఓ దుర్మార్గుడి మాయ మాటలు నమ్మామని.. కులాల్లో చిచ్చుపెట్టారని అన్నారు. చిన్న ఏమరుపాటుతో రాష్ట్రం 25 ఏళ్లు వెనక్కి తీసుకువెళ్లారని విమర్శించారు. ప్రపంచంలో ఏపీని అసహ్యించుకునేలా చేశారని మండిపడ్డారు. చంద్రబాబు మళ్లీ సీఎం అయ్యాక.. పరిశ్రమలు వస్తున్నాయని మంత్రి తెలిపారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి ఎవరు చేశారో ఆలోచించాలన్నారు. వైసీపీ పేరు, ఆ నాయకుడి పేరు చెప్పనని... అవి చెబితే దరిద్రం చుట్టుకుంటుందంటూ వ్యాఖ్యానించారు. ఆ ఐదేళ్లలో ఏ సబ్సిడీలు ఇచ్చారో చెప్పాలని ఛాలెంజ్ విసిరారు. బీమా సొమ్ము, ఆయిల్ సబ్సిడీ డబ్బులు బకాయిలు పెట్టారని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల మర బోట్ల ఆగడాలని పూర్తిగా అరికట్టామని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# రెస్టారెంట్‌లో కాల్పులు

## - నలుగురు మృతి.

## 8మందికి తీవ్ర గాయాలు

న్యూఢిల్లీ,మే19 నేషనలిస్ట్ వాయిస్)

తుర్కియేలో దారుణం చోటుచేసుకుంది. 17 ఏళ్ల ఓ యువకుడు రెస్టారెంట్‌లో తుపాకితో కాల్పులకు తెగబడ్డాడు. ఈ కాల్పుల్లో నలుగురు చనిపోగా.. 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. దక్షిణ తుర్కియేలోని మెర్సిన్ సిటీలో సోమవారం ఈ ఘోరం చోటుచేసుకుంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. 17 ఏళ్ల ఓ యువకుడు సోమవారం రాత్రి టార్సస్‌లోని ఓ రెస్టారెంట్‌లోకి ప్రవేశించాడు. వెంట తెచ్చుకున్న షాట్ గన్‌తో రెస్టారెంట్‌లోని వారిపై కాల్పులకు తెగబడ్డాడు. అనంతరం అక్కడినుంచి పరారయ్యాడు. ఈ కాల్పుల్లో నలుగరు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ వారిని దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. చనిపోయిన వారిని రెస్టారెంట్ యజమాని, రెస్టారెంట్ సిబ్బంది, పశువుల కాపరి, ట్రక్ డ్రైవర్‌గా గుర్తించారు. వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీసు బృందాలు పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలిస్తున్నాయి.

# మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు

## మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి

కామారెడ్డి,మే19 నేషనలిస్ట్ వాయిస్)

కామారెడ్డి పట్టణంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాల క్రితం కామారెడ్డి నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా, వర్షాకాలం మినహా మిగిలిన అన్ని కాలనీల్లోనూ నీటి ఎద్దడి ఏర్పడేదని అన్నారు. ఆ రోజుల్లో ప్రజలు ఖాళీ బిందెలతో రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలిపే వారని చెప్పారు.ఈ నీటి సమస్యను శాశ్వతంగా తీర్చడమే తమ ధ్యేయంగా ముందుకెళ్తున్నట్లు చెప్పారు. కామారెడ్డి పట్టణానికి 10 వాటర్ ట్యాంకులు ఉన్నాయని, అమృత్ 2.0 పథకంలో భాగంగా 9 వాటర్ ట్యాంకులు పూర్తయ్యాయని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, డీఈ హనుమంతరావు, ఏఈ వినోద్, కౌన్సిలర్లు వాజిద్, జావేద్, అంజద్, బబ్లు, నాయకులు, కాళ్ల గణేలిష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆదానీపై అమెరికాలో కేసులు కొట్టివేత

## - ఆధారాలు లేవని తేల్చిన న్యాయశాఖ

న్యూయార్క్,మే19 నేషనలిస్ట్ వాయిస్)

అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీలపై ఉన్న కేసులను అమెరికా న్యాయ శాఖ పూర్తిగా కొట్టివేసింది. యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) సహా పలు ఏజెన్సీలు ఈ కేసులను కొట్టివేశాయి. ఈ కేసులో ఎలాంటి ఆధారాలు లేవని, లంచాలు ఇచ్చినట్లుగా కూడా రుజువులు లేవని తేల్చింది. భారతదేశంలో ఒక సోలార్ పవర్ అమ్మకాల కాంట్రాక్టును గెలుచుకోవడానికి రూ. 2,000 కోట్లకు పైగా లంచాలు ఇచ్చారని, అలాగే పలు దశల్లో అమెరికన్ పెట్టుబడిదారుల నుంచి డబ్బు వసూలు చేశారని అదానీపై అమెరికాలో కేసులు నమోదయ్యాయి. అమెరికాలో ఇటువంటి ఆరోపణలను పూర్తిగా కొట్టివేయడం ఒక అసాధారణ చర్య అని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎస్ఈసీ దాఖలు చేసిన కేసును పరిష్కరించుకోవడానికి అదానీ 6 మిలియన్ డాలర్లు చెల్లించడానికి అంగీకరించినట్లు కోర్టు పత్రాలు చూపిస్తున్నాయి. సాగర్ అదానీ కూడా 12 మిలియన్ డాలర్లు చెల్లించడానికి అంగీకరించారు. తఎల్‌పీజీ దిగుమతులకు సంబంధించి ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలను అదానీ గ్రూప్ ఉల్లంఘించిందని ఆరోపిస్తూ యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ యొక్క ఆఫీస్ ఆఫ్ ఫారిన్ అసెట్స్ కంట్రోల్ (ఓఎఫ్ఏసి) దాఖలు చేసిన కేసు కూడా పరిష్కరించబడింది. ఈ ఒప్పందం 275 మిలియన్ డాలర్లకు కుదిరింది. అదానీ గ్రీన్ ఎనర్జీ మరియు అమెరికాకు చెందిన అజూర్ కంపెనీ, తమ సౌర విద్యుత్‌ను కొనుగోలు చేయడానికి కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈసీఐ) తో ఒక ఒప్పందం కుదుర్చుకున్నాయి. రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు ఎస్ఈసీఐ నుంచే విద్యుత్‌ను కొనుగోలు చేసేలా ప్రభావితం చేయడానికి గౌతమ్ అదానీ నేరుగా జోక్యం చేసుకున్నారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో అదానీ జరిపిన సమావేశంపై కూడా ఆరోపణలు ఉన్నాయి. నరేంద్ర మోడీకి అత్యంత సన్నిహితుడైన అదానీకి, ఎస్ఈసీ పంపిన సమన్లను జారీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం నిరాకరించింది.

# కులాలు, మతాల మధ్య చిచ్చుతో రాజకీయం

## - జగన్ తీరుపై మండిపడ్డ

## మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం,మే19 నేషనలిస్ట్ వాయిస్)

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కులాలు మతాల పేరుతో విభజన రాజకీయాలు చేస్తున్నారని ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ హయాంలో దళితులపై జరిగిన దాడులు మర్చిపోలేనివని చెప్పుకొచ్చారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు చేతిలో హత్యకు గురైన దళితుడు సుబ్రహ్మణ్యం నాల్గోవర్ధంతి మచిలీపట్నం బలరామునిపేటలోని ఎస్సీ కాలనీలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ నాయకులు, కాలనీలోని దళిత ప్రముఖులతో మంత్రి కొల్లు రవీంద్ర సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగన్ హయాంలో ఒక్క దళితులనే కాదని.. బీసీలు, మైనార్టీలు కూడా పెద్దఎత్తున దాడులకు గురయ్యారని మంత్రి కొల్లు రవీంద్ర ప్రస్తావించారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు దగ్గర డ్రైవర్‌గా పనిచేసిన దళితుడు సుబ్రహ్మణ్యంను చంపి శవాన్ని డోర్ డెలివరీ చేశారని ధ్వజమెత్తారు. నాడు ఆ కేసును తారుమారు చేసేందుకు జగన్ అనేక ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ కేసును నిష్పక్షపాతంగా విచారిస్తుంటే సాక్షులను ట్యాంపర్ చేసే ప్రయత్నాలు చేశారని చెప్పుకొచ్చారు. మాస్క్ అడిగిన పాపానికి డా. సుధాకర్‌ని పిచ్చోడిని చేసి చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. శాండ్‌లో అవినీతి జరుగుతోందని ప్రశ్నించిన ఓం ప్రకాష్‌ను ఉరివేసి చంపేశారని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు స్వేచ్ఛ వచ్చిందని తెలిపారు. జగన్ హయాంలో హత్యకు గురైన బీసీ సోదరుడు తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించామని అన్నారు. నేడు మళ్లీ జగన్ కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహించారు. అధికారులకు కులాలు అంటగట్టి దూషిస్తున్నారని మండిపడ్డారు. రోడ్డు ప్రమాదంలో ఓ పాస్టర్ చనిపోతే రాజకీయం చేయాలని చూశారని... వీటన్నింటినీ ప్రజలు గమనించాలని కోరారు. అన్నివర్గాలు సంఘటితమై ముందుకు సాగాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.

# శాండియాగో ఇస్లామిక్ సెంటర్‌లో కాల్పులు

## - ముగ్గురు మృతి..

## పోలీసుల దర్యాప్తు

శాన్ డియాగో,మే19 నేషనలిస్ట్ వాయిస్)

అమెరికాలో మరోసారి కాల్పుల ఘటన కలకలం రేపింది. శాన్ డియాగోలోని ఒక ఇస్లామిక్ సెంటర్‌లో జరిగిన కాల్పుల్లో ముగ్గురు మరణించారు. మసీదు, ఇస్లామిక్ పాఠశాల ఉన్న సముదాయంలో ఈ దాడి చోటుచేసుకుంది. జాతి విద్వేషం, మతపరమైన ద్వేషమే ఈ ఘటన వెనుక కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దక్షిణ కాలిఫోర్నియాలో సోమవారం జరిగిన ఈ ఘటనలో దాడికి పాల్పడిన ఇద్దరు యువకులు కూడా తుపాకీ గాయాలతో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వారు తమను తామే కాల్చుకున్నట్లు భావిస్తున్నామని శాన్ డియాగో పోలీస్ చీఫ్ స్కాట్ వాల్ వెల్లడించారు. ఇది ఇస్లామిక్ సెంటర్‌లో జరిగిన దాడి కావడంతో, జాతి వివక్షాపూరిత నేరంగా దర్యాప్తు చేస్తున్నాం అని ఆయన మీడియాకు తెలిపారు. దుండగుల వయస్సు 17, 19 సంవత్సరాల మధ్య ఉండొచ్చని అధికారులు పేర్కొన్నారు. మృతులలో ఒకరు ఇస్లామిక్ సెంటర్‌లో భద్రతా సిబ్బందిగా పనిచేస్తున్నారని, ఆయన సమయానికి స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని పోలీసులు తెలిపారు. మరణించిన ముగ్గురూ పెద్దవారేనని, పాఠశాలలో ఉన్న పిల్లలకు ఎలాంటి గాయాలు కాలేదని వెల్లడించారు. ఇస్లామిక్ సెంటర్ ఇమామ్ తాహా హసన్ మాట్లాడుతూ, తమ కేంద్రం ముస్లింలతో పాటు ముస్లిమేతరులు కూడా ప్రార్థనలు, విద్య కోసం వచ్చే ప్రదేశమని చెప్పారు. ప్రార్థనా స్థలాలపై ఇలాంటి దాడులు జరగడం అత్యంత దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టాడ్ గ్లోరియా మాట్లాడుతూ, శాన్ డియాగోలో జాతి విద్వేషానికి స్థానం లేదని, ముస్లిం సమాజానికి పూర్తి రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఘటనపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ, ఇది అత్యంత భయంకరమైన ఘటన అని పేర్కొన్నారు. యూఎస్ కాంగ్రెస్ సభ్యురాలు సారా జాకబ్స్, కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసమ్ కూడా ఈ దాడిని తీవ్రంగా ఖండించాయి. స్థానిక పోలీసులతో పాటు ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బిఐ) కూడా దర్యాప్తులో పాల్గొంటుందని ఎఫ్‌బిఐ డైరెక్టర్ కాష్ పటేల్ తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో న్యూయార్క్ లోని ప్రధాన మసీదుల వద్ద భద్రతను కట్టుదిట్టం చేసినట్లు అధికారులు వెల్లడించారు.

# పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను తగ్గించాలని ఐ ఎఫ్ టి యు ఆధ్వర్యంలో కంచికచర్లలో భవన నిర్మాణ కార్మికుల నిరసన

కంచికచర్ల మే 19, (నేషనలిస్ట్ వాయిస్‌న్యూస్ )

పెంచిన పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రజలపై భారం మోపే ధరలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించాలని పెంచిన ధరల వల్ల పెరగబోయే నిత్యవసర ధరలు పెరిగి ప్రజలపై మరింత భారలు పడే అవకాశం ఉంది కాబట్టి పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను తగ్గించాలని కోరుతూ మంగళవారం కంచికచర్ల మండల కార్యాలయం వద్ద ఐ యఫ్ టి యి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ప్రజలపై భారం మోపే పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేసారు. ఈ సందర్భంగా ఐఎఫ్టియు కంచికచర్ల మండలప్రధాన కార్యదర్శి జి హరికృష్ణ రెడ్డి మాట్లడుతూ కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు సైకిల్ తొక్కితే ప్రజల భారాలు తగ్గుతాయా అన్ని ప్రశ్నించారు. యుద్ధం కారణంగా వచ్చిన సంక్షోభాన్ని నివారణ చర్యలు చేపట్టలేని ప్రభుత్వం ప్రజలను పొదుపు కొనసాగించాలని మాట్లాడటం రాష్ట్ర కూటమి నాయకులు ఒకరోజు సైకిల్ పై వెళ్తే ధరలు నియంత్రించినట్ల అని అన్నారు . ఇంధన ధరలు పెంపు కారణంగా రాబోయే రోజుల్లో అన్ని రకాల ధరలు పెరిగి సామాన్యులపై భారం పడుతుందని అన్నారు. అమెరికా నియంత్రణలో భారత పాలన సాగటం దురదృష్టకారం దేశ ప్రజల మౌలిక సౌకర్యాలు కంటే కార్పొరేట్లు సామ్రాజ్యవాదుల లాభాలు చేకూర్చే పాలకులను ప్రజలు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్ఐ కి వినతిపత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో కంచికచర్ల మండల ఐ






ఎఫ్ టి యు అధ్యక్ష కార్యదర్శులు లక్కి శెట్టి ఆంజనేయులు జి హరికృష్ణ రెడ్డి బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ కంచికచర్ల మండల కమిటీ ఉపాధ్యక్షులు బండారి శీను తాటికొండ వీరయ్య.

# ఐకేపీ వీవోఏలకు కనీస వేతనాలు ఇవ్వాలి

## - సమ్మె నోటీస్ ఇచ్చిన వివోఏలు

కామారెడ్డి,మే19 నేషనలిస్ట్ వాయిస్)

తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఐకేపీ వీవోఏలకు కనీస వేతనాలు అందించాలని సిరికొండ మండల సమైఖ్య ఆధ్వర్యంలో ఏపీఎం సువర్ణకు, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్లలో మంగళవారం వీవోఏలు సమ్మె నోటీసులు అందజేశారు. ఐకేపీ వవీవోఏలకు రూ. 26 వేల వేతనం ఇవ్వాలని, సెర్ఫ్ ఉద్యోగులుగా గుర్తించి హెచ్ఆర్ పాలసీని వర్తింపజేయాలని, అర్హులైన వీవోఏలను గుర్తించి సీసీలుగా పదోన్నతి కల్పించాలని, రూ. 20 లక్షల బీమా వర్తింపజేయాలని, గ్రామాల్లో ఉచిత ట్యాబ్ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని, ఐడి కార్డు అందజేయాలని, జీవో నెంబర్ 58 సవరించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం వెంటనే చర్య తీసుకుని వేతనాల పెంపు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని, లేకుంటే దశలవారీగా సమ్మెకు దిగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు మున్ సింగ్, జ్యోతి, సీహెచ్ లక్ష్మి, ఎస్ లక్ష్మి, సునీత, సారా, లావణ్య, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి కోసం మహిళకు వేధింపులు

## - కాంగ్రెస్ నేతపై పోలీసుల కేసు నమోదు

కామారెడ్డి,మే19 నేషనలిస్ట్ వాయిస్)

ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయిస్తానని నమ్మబలికి, దానికి ప్రతిఫలంగా తన కోరిక తీర్చాలంటూ ఓ మహిళను వేధించిన ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం కేంద్రంలో చోటుచేసుకుంది. బాధితురాలు ఫిర్యాదు మేరకు రాజంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం రాజంపేట మండల కేంద్రం చెందిన ఒక మహిళకు ఇందిరమ్మ ఇండ్లు కావాలని కాంగ్రెస్ పార్టీకి చెందిన సదరు నాయకుడిని సంప్రదించింది. అయితే ఇల్లు మంజూరు చేయాలంటే తన కోరిక తీర్చాలని, తనకు లొంగిపోవాలని అతడు ఆమెను తీవ్రంగా వేధించడం ప్రారంభించాడు. ఈ వేధింపులు తట్టుకోలేక బాధితురాలు చివరికి రాజంపేట పోలీస్టేషన్లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి రాతపూర్వక ఫిర్యాదు మేరకు సదరు కాంగ్రెస్ నాయకుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.ఇందిరమ్మ ఇండ్ల విషయంలో మహిళపై అసభ్యంగా ప్రవర్తించినందుకు, పలువురిని డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపణ రావడంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన బెస్ట్ చంద్రంను పార్టీ అధిష్టానం మేరకు వాటి నుండి సస్పెండ్ చేశామని రాజంపేట మండల అధ్యక్షుడు కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

# మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

## - వేట నిషేధ భృతిని అందిస్తున్న సిఎం చంద్రబాబు

## - మత్స్యకారుల సేవ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం,మే19 నేషనలిస్ట్ వాయిస్)

మత్స్యకారులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం అన్ని రకాలైన కార్యక్రమాలూ చేపడుతుందని రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వానికి






ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాల్లో ఎక్కడా లోటు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేట నిషేధ భృతిని మత్స్యకారులకు తొలిసారిగా ప్రకటించింది సీఎం చంద్రబాబు నాయుడే అని ఈ సందర్భంగా గుర్తుచేశారు. మంగళవారం మచిలీపట్నం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'మత్స్యకారుల సేవ' కార్యక్రమానికి మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. తొలుత బియ్యం, నిత్యవసర వస్తువులతో పాటు డీజిల్ సబ్సిడీ కోసం నాడు నడకుదిటి నరసింహరావు కృషి చేశారని వివరించారు. మత్స్యకారులకు వేట నిషేధ భృతి ఏకంగా రూ. 20వేలకు పెంచామని కొల్లు రవీంద్ర వివరించారు. తనకు మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసునన్నారు. రూ. 4,000తో ప్రారంభించిన వేట నిషేధ భృతిని రూ. 20 వేల వరకు పెంచిన ఘనత కూడా కూటమి ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. రూ. 260 కోట్లు మత్స్యకార భరోసా పథకంతో మత్స్యకారుల ఖాతాల్లో జమ చేయడం హర్షణీయమన్నారు. మత్స్యకారుల జీవితాలను నాశనం చేసేలా వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ రెడ్డి జీవో నెం.217 తీసుకొస్తే.. దానిని కూటమి ప్రభుత్వం రాగానే రద్దు చేసిందని తెలిపారు. కృష్ణా జిల్లాలో 18 వేల మంది మత్స్యకారులకు వేట నిషేధ భృతిని అందించామని ఎక్సైజ్ శాఖ మంత్రి వివరించారు. డీప్ సీ బోట్స్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 1.20 కోట్లు కేటాయించినా.. ఇక్కడ సదుపాయాలు లేవన్నారు. సీ వీడ్ (సముద్రపు నాచు) పండించడం ద్వారా కూడా మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మచిలీపట్నంలో రూ. 75 లక్షల వ్యయంతో పీతల హేచరీ ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు. మత్స్యకారులు 250 బోట్లతో ముఖ్యమంత్రి చంద్రబాబుకి ధన్యవాదాలు చెప్పడం హర్షణీయం అన్నారు. మత్స్యకారులను ఇంటికి పిలిచి విందు ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌కు ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర ధన్యవాదాలు తెలిపారు.

# పవన్ కళ్యాణ్ ఆరోగ్యంపై కేంద్రమంత్రి ఆరా

## - నేరుగా ఫోన్ చేసి పలకరించిన ప్రహ్లాద్ జోషి

అమరావతి,మే19 నేషనలిస్ట్ వాయిస్)

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరోగ్యం గురించి కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి ఫోన్ చేసి ఆరా తీశారు. ఇటీవల పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స జరిగిన నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కొన్నిరోజుల క్రితం పవన్ కల్యాణ్‌కు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో ముక్కుకు సంబంధించిన శస్త్రచికిత్స జరిగిన విషయం తెలిసిందే. వైద్యుల సూచన మేరకు ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. 'మీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోండి. ఆరోగ్యం అన్నిటికన్నా ముఖ్యం. మీ ఆరోగ్యం బాగుంటేనే ప్రజల కోసం మరింత సమర్థంగా పని చేయగలుగుతారు' అంటూ పవన్ కల్యాణ్‌ను ఫోన్‌లో ప్రహ్లాద్ జోషి పరామర్శించారు. రాజకీయ బాధ్యతలతో పాటు వ్యక్తిగత ఆరోగ్యంపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. పవన్ కల్యాణ్ త్వరగా కోలుకొని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. 'నేను ఆంధ్రప్రదేశ్‌కు వచ్చినప్పుడు తప్పకుండా మిమ్మల్ని కలుస్తాను' అని డిప్యూటీ సీఎంకు చెప్పారు. అంతేకాకుండా పవన్ ఆరోగ్యం కోసం తాను తిరుపతి బాలాజీని ప్రార్థిస్తున్నానని ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు.

# ధాన్యం కొనకపోవడంతో రైతులకు తిప్పలు

## - ప్రభుత్వ తీరుపై మండిపడ్డ బిఆర్ఎస్ నేత

కరీంగనర్,మే19 నేషనలిస్ట్ వాయిస్)

రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటను కొనుగోలు చేయకుండా అరిగోస పెడుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ జిల్లా హుజరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయకుండా ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాల్ వరి ధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తామని ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం కనీసం పండించిన పంటను కూడా కొనుగోలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కల్లాల మీదే ధాన్యం కొనుగోలు చేసేవారని గుర్తు చేశారు. ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న ప్రైవేట్ వ్యాపారులు కొర్రీలు పెడుతూ ఒక్కో బస్తా మీద నాలుగు నుంచి ఐదు కిలోల తరుగు తీయడంతో పాటు ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర చెల్లించడం లేదని అన్నారు. ప్రభుత్వం వహిస్తున్న అలసత్వం వల్ల రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, పలువురు రైతులు మానసిక క్షోభకు గురై ఆత్మహత్యకు కూడా పాల్పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఎద్దు ఏడ్చిన యవుసం రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడిన చరిత్ర లేదనే సత్యాన్ని గ్రహించాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి వెంటనే రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని, లేని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# దేశంలో చాపకింద నీరులా మతమార్పిళ్లు

## - నాసిక్ ఘటన మరువక ముందే మరో ఘటన

## - యూపిలో నెట్‌వర్క్‌ను ఛేదించిన పోలీసులు

## - పదిమంది నిందితుల అరెస్ట్..ముమ్మర దర్యాప్తు

లక్నో,మే19 నేషనలిస్ట్ వాయిస్)

నాసిక్‌లోని ఓ బహుళజాతి కంపెనీలో బలవంతపు మత మార్పిళ్లు, లైంగిక వేధింపులు చోటుచేసుకోవడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అటువంటి మరో ఘటన ఉత్తర్‌ప్రదేశ్ లోని మిర్జాపుర్‌లో వెలుగులోకి వచ్చింది. జిమ్‌లలో చేరే మహిళలను లక్ష్యంగా చేసుకొని మత మార్పిళ్లు చేస్తున్న నెట్‌వర్క్‌ను పోలీసులు గుర్తించారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం.. మిర్జాపుర్‌లోని ఓ జిమ్ యజమాని మతం మారాలని బలవంతం చేస్తున్నట్లు ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసుపై విచారణ చేస్తుండగా.. దీని వెనుక పెద్ద నెట్ వర్క్ ఉన్నట్లు గుర్తించారు. నిందితులు రాష్ట్రంలోని వివిధ జిమ్‌లు, సోషల్‌మీడియాల్లో ముందుగా మహిళలతో పరిచయాలు పెంచుకొని.. అనంతరం మత మార్పిడి చేసుకోవాలని వారిపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. దాదాపు 50 మందికి పైగా మహిళలను లక్ష్యంగా చేసుకుని ఈ ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేసులో సన్నో అనే మహిళ ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. ముందుగా జిమ్‌లలో చేరి అక్కడి యువతులతో పరిచయం పెంచుకుంటుందని.. అనంతరం తన స్నేహితులుగా పేర్కొంటూ పలువురు ముస్లిం యువకులను వారికి పరిచయం చేస్తుందని పేర్కొన్నారు. మరికొందరు మహిళలను నిందితులు ఇన్‌స్టాగ్రామ్‌లో ఫ్రెండ్ రిక్వెస్ట్‌ల ద్వారా పరిచయం పెంచుకొని.. వారిలో మతమార్పిడి ఆలోచనలు కలిగేలా బ్రెయిన్ వాష్ చేసేవారని పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్‌లలో వందలాది మంది మహిళల ఫొటోలు, వీడియోలు, చాట్‌లు ఉన్నాయని.. వాటిపై దర్యాప్తు చేస్తున్నామన్నారు.

# కవాడీగూడాలో దారుణ ఘటన

## - స్పా సెంటర్‌లో భార్యను హత్య చేసిన భర్త

హైదరాబాద్,మే19 నేషనలిస్ట్ వాయిస్)

గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కవాడిగూడలో కట్టుకున్న భార్యను భర్త అతి కిరాతకంగా చంపేశాడు. గొడవ పడి స్పా సెంటర్‌కు వచ్చిన భార్యపై భర్త కత్తితో దాడి చేసి హత్య చేశాడు. అనంతరం నిందితుడు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. బంగి దేబోరా అనే మహిళ తన భర్తతో కలిసి బహదూర్‌పూర్ కిషన్‌బాగ్‌లో నివసిస్తోంది. కవాడిగూడలోని స్పా సెంటర్‌లో మృతురాలు బ్యూటీషియన్‌గా పనిచేస్తోంది. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి.మంగళవారం ఉదయం కూడా భర్తతో గొడవపడిన దేబోరా.. విధుల కోసం స్పా సెంటర్‌కు వెళ్లింది. భార్య గొడవపడటంతో ఆగ్రహానికి గురైన భర్త.. కవాడిగూడ రత్నదీప్ బిల్డింగ్‌లోని నాలుగో అంతస్తులో ఉన్న స్పా సెంటర్‌కు వెళ్లాడు. తన వెంట తెచ్చుకున్న కత్తితో భార్యపై విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన మహిళ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. హత్య అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఆపై అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. హత్యపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలికి చేరుకుని బంగి దేబోరా మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# టీ. నర్సాపురంలో భారత్ గ్యాస్ డీలర్ల ఇష్టారాజ్యం

## - బుకింగ్ దాటినా 45 రోజులు వెయిటింగ్‌లా?
## - హోమ్ డెలివరీకి రూ. 1200 వసూళ్లు..
## గ్రామస్తుల ఆగ్రహం

**టీ. నర్సాపురం (ఏలూరు జిల్లా):నేషనలిస్ట్ వాయిస్)**




ఏలూరు జిల్లా టీ. నర్సాపురం మండల కేంద్రంలో భారత్ గ్యాస్ వినియోగదారుల పట్ల స్థానిక గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు నిలువుదోపిడీకి తెరలేపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, సామాన్య ప్రజల నుంచి ముక్కుపిండి మరీ అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**రూ. 1200 వసూలు.. అసలు రేటెంత?**

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వినియోగదారులు గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్న తర్వాత, హోమ్ డెలివరీ ఇవ్వడానికి గాను ఏజెన్సీ సిబ్బంది ఏకంగా రూ. 1200 వరకు వసూలు చేస్తున్నారని గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు."అసలు ప్రభుత్వం నిర్ణయించిన అధికారిక రేటు 960 వీరు వసూలు చేస్తున్నది 1200 అదనపు ఛార్జీల పేరిట ఇంత దోపిడీ చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారు?" అని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

**మెసేజ్ వచ్చినా.. 45 రోజుల సాకులు!**

ఇదిలా ఉంటే, మరికొంతమంది వినియోగదారుల పరిస్థితి మరింత ఘోరంగా తయారైంది. సిలిండర్ బుక్ చేసిన తర్వాత ఫోన్‌కు "డెలివరీ విజయవంతమైంది" అని మెసేజ్‌లు వస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం సిలిండర్లు సరఫరా చేయడం లేదు. దీనిపై ఏజెన్సీని నిలదీస్తే... "మరో 45 రోజులు టైం పడుతుంది" అంటూ పొంతన లేని సాకులు చెబుతూ వినియోగదారులను నెలల తరబడి తిప్పుకుంటున్నారని సమాచారం.

**కదిలిన గ్రామస్తుడు నిలదీయడంతో దిగొచ్చిన ఏజెన్సీ**

నిర్వాహకుల వేధింపులు భరించలేక మంగళవారం టీ. నర్సాపురం మండల కేంద్రంలో ఉన్న భారత్ గ్యాస్ ఆఫీసు వద్దకు గ్రామస్తుడు వెళ్లి సకాలంలో గ్యాస్ ఎందుకు ఇవ్వడం లేదని, మెసేజ్ వచ్చినా సిలిండర్ ఎందుకు దాస్తున్నారని అధికారులను, సిబ్బందిని గట్టిగా నిలదీశారు. గ్రామస్తుడి ఆగ్రహం చూసి దిగొచ్చిన ఏజెన్సీ ప్రతినిధులు, వెంటనే సదరు బాధితుడికి గ్యాస్ బండను అప్పగించి పంపించినట్లు సమాచారం

**తక్షణమే చర్యలు తీసుకోవాలి: గ్రామస్తుల డిమాండ్**

ప్రజాధనాన్ని దోచుకుంటూ, సేవల్లో తీవ్ర ఆలస్యం చేస్తూ సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తున్న ఇలాంటి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులపై, బాధ్యులైన అధికారులపై ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని టీ. నర్సాపురం మండల గ్రామస్తులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# బోథ్ రాజకీయాల్లో మళ్లీ చురుకైన మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

## - తెలంగాణ రక్షణ సేనతో ప్రజల్లోకి..
## భారీ చేరికలతో వేడెక్కిన రాజకీయాలు







**ఆదిలాబాద్ జిల్లా మే 19 నేషనలిస్ట్ వాయిస్)**

రాథోడ్ బాపురావు ఆధ్వర్యంలో బోథ్ నియోజకవర్గ రాజకీయాలు మరోసారి వేడెక్కుతున్నాయి. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆయన, ప్రస్తుతం తెలంగాణ రక్షణ సేన పార్టీతో ప్రజల్లో చురుకుగా పర్యటిస్తూ రాజకీయంగా మళ్లీ యాక్టివ్ అవుతున్నారు. గ్రామీణాభివృద్ధి, గిరిజన సంక్షేమం, రైతు సమస్యల పరిష్కారం వంటి అంశాలతో ప్రజల మధ్యకి వెళ్తుండటంతో స్థానిక రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది.

దాదాపు పదేళ్ల పాటు బోథ్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా సేవలందించిన రాథోడ్ బాపురావు తన పదవీకాలంలో గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు. రోడ్లు, తాగునీటి సౌకర్యాలు, విద్యా సంస్థల అభివృద్ధి, రైతు సంక్షేమ కార్యక్రమాలతో పాటు గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల మన్ననలు పొందారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమ సమయంలో కూడా ఆయన చురుకైన పాత్ర పోషించారు. పలు ఆందోళనలు, నిరసన కార్యక్రమాల్లో పాల్గొని ఉద్యమకారుడిగా ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ప్రజా సమస్యలపై స్పందిస్తూ రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నారు.

ఇటీవల బోథ్ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించిన రాథోడ్ బాపురావుకు కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. తెలంగాణ నినాదాలతో మార్మోగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ రక్షణ సేన ద్వారా కృషి చేస్తానని తెలిపారు.

"తెలంగాణ కోసం ఎన్నో త్యాగాలు జరిగాయి. కానీ గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆశలు పూర్తిగా నెరవేరలేదు. గిరిజనుల భూమి హక్కులు, రైతుల సమస్యలు, యువత ఉపాధి అంశాలపై ఇంకా పోరాటం అవసరం ఉంది" అని ఆయన పేర్కొన్నారు.

బోథ్ పట్టణంలో నిర్వహించిన భారీ సమావేశంలో తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు కవిత సమక్షంలో మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ఆధ్వర్యంలో 250 మందికి పైగా వివిధ పార్టీల నాయకులు, యువకులు, కార్యకర్తలు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా డప్పుల మోతలు, తెలంగాణ జెండాలు, నినాదాలతో సభా ప్రాంగణం సందడిగా మారింది.

సభలో మాట్లాడిన కవిత తెలంగాణ హక్కుల పరిరక్షణ, రైతుల సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, సామాజిక న్యాయం సాధన కోసం తెలంగాణ రక్షణ సేన కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదుగుతోందన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేస్తామని, ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు.

సమావేశంలో పాల్గొన్న పలువురు నాయకులు రాష్ట్రంలో రైతులకు గిట్టుబాటు ధరలు అందడం లేదని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు తగ్గిపోయాయని, గ్రామీణాభివృద్ధి పనులు మందగించాయని విమర్శించారు.

ఈ సందర్భంగా పలువురు యువకులు, మహిళలు తెలంగాణ రక్షణ సేనలో చేరగా, నాయకులు వారికి కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. అనంతరం కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించి తెలంగాణ నినాదాలతో పట్టణంలో ప్రదర్శన చేపట్టారు.

రాథోడ్ బాపురావు మళ్లీ రాజకీయంగా చురుకుగా మారడం బోథ్ నియోజకవర్గంలో కొత్త రాజకీయ సమీకరణాలకు దారితీసే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాబోయే రోజుల్లో ఆయన రాజకీయ వ్యూహం ఎలా ఉండబోతుందన్న దానిపై స్థానికంగా ఆసక్తి నెలకొంది.

# వీధికుక్కలను తరలించాల్సిందే

## - ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు
## - ప్రతి జిల్లాలో పూర్తిస్థాయిలో బర్త్ కంట్రోల్
## - స్కూళ్లు, కాలేజీలు, బస్టాండ్లలో కుక్కలను లేకుండా చేయాలి
## - గతంలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాల్సిందేనన్న సుప్రీం

**న్యూఢిల్లీ,మే19 నేషనలిస్ట్ వాయిస్)**

వీధికుక్కల బెడదను రూపుమాపాల్సిందేనని సుప్రీం మరోమారు స్పష్టం చేసింది. ఈ విషయంలో రాజీలేదని తెలిపింది. ఇది ప్రజల ప్రాణాల భద్రతకు సంబంధించిన అంశగా పేర్కొంది. బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కలను తొలగించాలంటూ గతంలో జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. గతంలో జారీ చేసిన ఆ ఉత్తర్వులను సవరించాలని చేసిన విజ్ఞప్తిని కూడా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. స్కూల్, కాలేజీ, రైల్వే స్టేషన్, బస్టాండ్ తదితర బహిరంగ ప్రదేశాల్లో కుక్కలను తొలగించాలంటూ జంతు ప్రేమికులు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు మంగళవారం విచారించింది. ఈ సందర్భంగా జంతు సంక్షేమ బోర్డు దాఖలు చేసిన అన్ని పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ సందర్భంగా తన తీర్పులో.. పలు కీలక అంశాలను సుప్రీంకోర్టు ప్రస్తావించింది. వీధి కుక్కల సమస్యను జంతు సంక్షేమ అంశంగా కాకుండా ప్రజల ప్రాణాల భద్రతకు సంబంధించిన అంశంగా పరిగణించాలని పిటిషనర్లకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా రూపొందించిన నియమావళిని సమర్థవంతంగా అమలు చేయడం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు సూచించింది. ప్రతి జిల్లాలో కనీసం ఒక పూర్తి స్థాయి యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. జనాభాను దృష్టిలో ఉంచుకొని అవసరమైతే జిల్లాలో ఈ కేంద్రాల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా నిబంధనలు కచ్చితంగా అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రజల భద్రత దృష్టిలో ఉంచుకుని స్కూళ్లు, కాలేజీలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లతోపాటు ఇతర ప్రదేశాల్లో కూడా ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా యాంటీ రేబిస్ మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. రహదారులపై సంచరించే పశువుల సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జాతీయ రహదారులపై తిరిగే జంతువుల సమస్యల పర్యవేక్షణ కోసం ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్‌ఏఐను కోరింది. రేబిస్ బారిన పడిన లేదా మానవుల ప్రాణాలకు ముప్పుగా పరిణమించే ప్రమాదకర కుక్కల విషయంలో చట్టబద్ధంగా అనుమతించిన చర్యలు తీసుకోవచ్చని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాల అమలు కోసం విధులు నిర్వహించే ఉద్యోగులకు తగిన రక్షణ కల్పించాలని ప్రభుత్వాలకు సూచించింది. విధులు నిర్వర్తించే క్రమంలో వారిపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది.

# నగరంలో వరుస అత్యాచారాలు

## - సినిమా షూటింగ్ పేరుతో మాయమాటలు
## - యువతిపై ఇద్దరు యువకుల అత్యాచారం- బిటెక్ స్టూడెంట్‌పై తోటి స్టూడెంట్ అత్యాచారం

**హైదరాబాద్,మే19 నేషనలిస్ట్ వాయిస్)**

నగరంలో దారుణాలు వెలుగు చూస్తున్నాయి. అమ్మాయిలను మోసం చేసి అత్యాచారాలు చేస్తున్నారు. కేసులు నమోదవుతున్నా భయం లేకుండా తెగిస్తున్నారు. సికింద్రాబాద్‌లో ఓ యువతిపై ఇద్దరు యువకులు రెండ్రోజుల పాటు అత్యాచారం సాగించారు. ఇబ్రహింపట్నంలో ఓ బిటెక్ విద్యార్థినిపై తోటి విద్యార్థి అత్యాచారం చేశారు. వివరాల్లోకి వెళితే...సినిమా షూటింగ్ ఆశచూపి ఓ యువతిపై ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడటం తీవ్ర కలకలం రేపుతోంది. జూబ్లీహిల్స్ మెట్రో స్టేషన్ సమీపంలో ఇద్దరు యువతులు నివసిస్తున్నారు. సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారిలో ఓ యువతికి సినిమా షూటింగ్ ఉందంటూ యువకుడు మాయమాటలు చెప్పి నమ్మించాడు. సినిమా షూటింగ్ అనడంతో నమ్మిన యువతి.. యువకుడితో కలిసి సికింద్రాబాద్‌కు వెళ్లింది. సికింద్రాబాద్‌లోని గదికి తీసుకెళ్లిన యువకుడు.. తన స్నేహితుడితో కలిసి యువతిపై రెండు రోజుల పాటు లైంగిక దాడికి పాల్పడ్డాడు. నిందితులు ఈనెల 16న ర్యాపిడో బుక్ చేయించి తిరిగి యువతిని ఇంటికి పంపించేశారు. బాధితురాలి శరీరంపై గాయాలు ఉండటంతో స్నేహితురాలు ఆమెను గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించింది. అక్కడ వైద్యులు ఏం జరిగిందని ప్రశ్నించగా.. లైంగిక దాడి జరిగిన విషయాన్ని బాధితురాలు చెప్పింది. ఈ ఘటనపై బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఇద్దరు గుర్తుతెలియని యువకులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఇకపోతే ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. మద్యం తాగించి బీటెక్ చదువుతున్న యువతిపై తోటి విద్యార్థి అత్యాచారం చేశాడు. దీంతో బాధితురాలు ఇబ్రహీంపట్నం పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు ఉడుతల విజయ్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని రిమాండ్‌కు తరలించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్‌కు చెందిన ఉడుతల ఉదయ్.. ఇబ్రహీంపట్నం సమీపంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. మే 14వ తేదీన తనతోపాటు చదువుతున్న యువతిని టీ తాగుదామని ఆహ్వానించాడు. ఇద్దరు కారులో దిల్‌సుఖ్‌నగర్‌కు వెళ్లారు. టీ తాగిన అనంతరం తిరుగు ప్రయాణంలో ఉడుతల విజయ్ మద్యం కొనుగోలు చేశాడు. ఆ తర్వాత బీడీఎస్ రోడ్డులోని నిర్మానుష్య ప్రదేశానికి కారులో ఆ యువతిని తీసుకెళ్లాడు. విద్యార్థినితో అతడు మద్యం తాగించాడు. మత్తులో ఉన్న ఆమెను తన గదికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. దీంతో ఇబ్రహీంపట్నం పోలీసులకు యువతి ఫిర్యాదు చేసింది. దీంతో ఉడుతల ఉదయ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. యువతిని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

# ఎబోలాపై అప్రమత్తమైన భారత్

## - ప్రజలకు హెచ్చరిక చేసిన అధికారులు

**న్యూఢిల్లీ,మే19 నేషనలిస్ట్ వాయిస్)**

ఆఫ్రికాలోని కాంగో, ఉగాండా సహా పలు దేశాల్లో ఎబోలా వైరస్ వేగంగా విజృంభిస్తోంది. ఈ ప్రాణాంతక వ్యాధి కారణంగా ఇప్పటికే 100 మంది మృతి చెందారు. 390 అనుమానిత కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. కాంగోలోని ఆరుగురు అమెరికన్లకు ఈ వ్యాధి సోకినట్లు పేర్కొన్నారు. వీరిని క్వారంటైన్ కోసం సురక్షిత ప్రదేశానికి తరలించేందుకు అమెరికా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఎబోలా వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. ఎబోలా వ్యాప్తిని జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం (ఎన్‌సీడీసీ) నిశితంగా గమనిస్తోందని, దేశంలోకి ఈ వ్యాధి ప్రవేశించ కుండా నిఘా పెట్టిందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో ఎబోలా వ్యాప్తి లేనప్పటికీ అంతర్జాతీయ ప్రయాణాలు, ప్రపంచ అనుసంధానం కారణంగా భారత్ అంటువ్యాధుల ముప్పు పట్ల అప్రమత్తంగా ఉండాలని దిల్లీలోని ఎయిమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సంజయ్ రాయ్ హెచ్చరించారు. ప్రస్తుతం దేశానికి ఎబోలా ముప్పు తక్కువగానే ఉందని, ఈ వ్యాధి వ్యాప్తిపై ఆందోళన చెందాల్సి అవసరం లేదని ఆయన సూచించారు.

# పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతే రాష్ట్రానికి దేశానికి మంచి గుర్తింపు వస్తుంది

## - జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా..

**దేవరకద్ర మే 19 నేషనలిస్ట్ వాయిస్**

కోయిల్ సాగర్ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతే జిల్లాకే కాకుండా రాష్ట్రానికి దేశానికి మంచి గుర్తింపు వస్తుందని జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కోయి ల్ సాగర్ ప్రాజెక్ట్ వద్ద పర్యాటక అవగాహన కార్యక్రమంలో పాల్గొని ఆమె ప్రసంగించారు.జిల్లా యువజన, క్రీడలు మరియు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మే 18 నుంచి 23 వరకు నిర్వహిస్తున్న పర్యాటక, యువజన, క్రీడల వారోత్సవాల సందర్భంగా మంగళవారం దేవరకద్ర మండలం లోని కోయిలసాగర్ ప్రాజెక్ట్ వద్ద జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పర్యాటక అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించి కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కోయిల సాగర్ ప్రాజెక్ట్ వద్ద పర్యాటక అవగాహన కార్యక్రమం పాల్గొనడం ఆనందంగా ఉందనీఆమె అన్నారు. కోయిలసాగర్ ప్రాజెక్ట్ పర్యాటకులను ఆకర్షించడమే కాకుండా రైతుల పంటలకు సాగునీరు అందిస్తూ జిల్లాలో వ్యవసాయాభివృద్ధికి కూడా తోడ్పడుతోందనిఆమె తెలిపారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. కోయిల సాగర్ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందితే జిల్లాకే కాకుండా రాష్ట్రం, దేశానికి కూడా మంచి గుర్తింపు వస్తుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రాజెక్టులు, చారిత్రక ప్రదేశాలను సందర్శించడం ద్వారా పిల్లలు కేవలం ఆనందాన్ని మాత్రమే కాకుండా, ప్రాజెక్టుల ప్రాముఖ్యత, మన పూర్వీకుల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాల గురించి అవగాహన పొందే అవకాశం కలుగుతుందని ఆమె తెలిపారు. వేసవి సెలవులను సద్విని యోగం చేసుకుంటూ విద్యార్థులు తమ తల్లిదండ్రులు, స్నేహితులతో కలిసి జిల్లాలోని చారిత్రక, పర్యాటక ప్రదేశాలైన పిల్లలమర్రి, కోయిలసాగర్ ప్రాజెక్ట్ తదితర ప్రాంతాలను సందర్శించాలని సూచించారు. ఇటువంటి పర్యటనల ద్వారా వినోదంతో పాటు జ్ఞానాన్ని కూడా పెంపొందించుకోవచ్చని ఆమె అన్నారు.పిల్లలు ప్రశ్నించే గుణాన్ని అలవర్చుకుని, సందర్శించిన ప్రదేశాల విశేషాలను అక్కడి నిపుణులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. దీని ద్వారా అనేక కొత్త విషయాలను తెలుసుకునే అవకాశం లభిస్తుందనిఆమె పేర్కొన్నారు. అనంతరం కోయిల సాగర్ ప్రాజెక్ట్ డ్యాం ను సందర్శించి ప్రాజెక్ట్ ఆయకట్టు, నీటి నిల్వ సామర్థ్యం, నీటి వనరుల లభ్యత, వ్యవసాయానికి, త్రాగునీటి అవసరాలకు ఎంత నీటిని వాడుతున్నారు, ప్రాజెక్ట్ యొక్క మరమ్మత్తు, నిర్వహణ, పెండింగ్ పనుల నిర్మాణం వంటి విషయాల గురించి జిల్లా కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను అడిగి ఆమె తెలుసుకున్నారు. కోయిలసాగర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి ఎస్. ఎస్. సి లో వంద శాతం పాస్ సాధించిన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయునికి, ఉపాధ్యాయులకు, అలాగే ఎస్.ఎస్.సి విద్యార్థులకు జిల్లా కలెక్టర్ సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల కాంపౌండ్ గోడ నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆమె ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో కోయిలసాగర్ గ్రామంలో నిర్వహించిన వేసవి క్యాంపులో శిక్షణ పొందిన వాలీబాల్ క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేశారు. తదుపరి నాగారం గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జిల్లా యువజన, క్రీడలు మరియు పర్యాటక శాఖ అధికారి రాజశేఖర్ రెడ్డి, దేవరకద్ర మండల తహసీల్దార్, హర్షద్,ఎం పి డి ఓ, శ్రీనివాసరావు, ఎంఈఓ, బలరాం, కోయిల్ సాగర్ స్థానిక పాఠశాల ప్రధానో పాధ్యాయులు,అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం

## - జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా..

**దేవరకద్ర మే 19 నేషనలిస్ట్ వాయిస్**

కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ వద్ద టూరిజం అభివృద్ధి గురించి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కోయిల్ సాగర్ ప్రాజెక్టు వద్ద ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా టూరిజం శాఖ ఆధ్వర్యంలో కోయిల్ సాగర్ ప్రాజెక్టు వద్ద అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, మరియు అడిషనల్ కలెక్టర్ హరిప్రియ, హాజరయ్యారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టూరిజం అభివృద్ధి గురించి చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. టూరిజం గురించి అవగాహన కల్పించారు. కోయిల్ సాగర్ ప్రాజెక్టు గురించి వివరించారు.మన జిల్లాలో ఉన్న టూరిజం స్థలాలను సందర్శించి టూరిజం గురించి తెలుసుకోవాలని సూచించారు. అలాగే వారసత్వ సంపాదన కాపాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి వై ఎస్ ఓ రాజశేఖర్ రెడ్డి, తాసిల్దార్ హర్షత్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ బలరాం, ఆర్ ఐ శరత్, నాయక్, హై స్కూల్ హెడ్మాస్టర్ రమేష్ ఆర్ ఐ శరత్ ఇరిగేషన్ డిపార్ట్మెంట్ అధికారులు పీడీలు పీటీలు గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.








# రైతులు స్థిరమైన ఆదాయం సాదించేందుకు సమీకృత వ్యవసాయ విధానమే ఉత్తమ మార్గం

## - కృషి విజ్ఞాన కేంద్రం మత్స్య విభాగం శాస్త్రవేత్త దేవీవరప్రసాద్ రెడ్డి






**తాడేపల్లిగూడెం ప్రతినిధి మే 19 నేషనలిస్ట్ వాయిస్)**

రైతులు స్థిరమైన ఆదాయాన్ని సాదించేందుకు సమీకృత వ్యవసాయ విధానమే ఉత్తమ మార్గమని కృషి విజ్ఞాన కేంద్రం మత్స్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఏ.దేవీవరప్రసాద్ రెడ్డి సూచించారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయంలోని కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రాంగణంలోని సమీకృత వ్యవసాయ పద్ధతుల క్షేత్రంలో మంగళవారం ఆయన అధ్యక్షతన రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఖరీఫ్ 2026 సాగులో సమతుల్య ఎరువుల వినియోగం అనే అంశంలోభాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ దేవీవరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో రైతులు సాంప్రదాయిక పంటలపైనే ఆధార పడటం వల్ల ఎన్నో ఆర్థిక సవాళ్లను ఎదుర్కోవలసి వస్తుందని చెప్పారు. రైతులు కేవలం ఒకే రకమైన పంటపై ఆధారపడకుండా, దాని అనుబంధ కార్యకలాపాలపై కూడా దృష్టిసారిస్తే, రైతులకు లాభాలు పెరగడమే కాకుండా, స్థిరమైన ఆదాయం కూడా లభిస్తుందని చెప్పారు. సమీకృత వ్యవసాయ విధానంలో భాగంగా పంటలతో పాటు చేపల పెంపకం, పశుపోషణ, కోళ్ళ పెంపకం వంటి వాటిని చేపట్టడటం ద్వారా ఒకే యూనిట్ నుంచి బహుళ ఆదాయ వనరులను పొందవచ్చన్నారు. చేపల చెరువులోని నీటిని పంటలకు ఉపయోగించడం, పశువుల నుంచి లభించే పేడ నుంచి సేంద్రియ ఎరువును తయారు చేసుకోవడం, కోళ్ళ పెంపకం ద్వారా గుడ్లు, మాంసం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందడం సాధ్యమవుతుందని, ఈ విధానం వల్ల రైతుల నికర ఆదాయం గణనీయంగా పెరుగుతుందన్నారు. వ్యర్థాలు తగ్గటంతోపాటు పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో ఒక పంటకు నష్టం వాటిల్లినా, ఇతర పంటల ద్వారా ఆదాయం లభించడంతో రైతుల ఆర్థిక స్థితి దెబ్బతికుండా వ్యవసాయాన్ని మరింత సురక్షితమైన వృత్తిగా మారుస్తుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి లభించే ప్రోత్సాహకాలు, శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుంటూ రైతులు సమీకృత వ్యవసాయ పద్ధతులను అమలు చేయాలని వివరించారు. వివిధ గ్రామాల 42 మంది రైతులు హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్ పూర్తి నగదు రికవరీ చేసిన బోథ్ పోలీసులు

## - రూ.70 వేల నగదును స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలింపు.

## - చాకచక్యంతో వ్యవహరించి కేసు త్వరితగతిన ఛేదన.

**ఆదిలాబాద్ జిల్లా, మే 19 నేషనలిస్ట్ వాయిస్ )**

ఆదిలాబాద్ జిల్లా బోథ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సొనాల మండలం సాకెర గ్రామానికి చెందిన జాదవ్ దేవ్ కాబాయ్ అనే మహిళ ఇంట్లో ఈ నెల 13వ తేదీన రూ. 70,000 నగదు దొంగతనానికి గురైంది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బోథ్ ఎస్సై పురుషోత్తం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.కేసు దర్యాప్తులో భాగంగా ఎస్ఐ పురుషోత్తం సిబ్బందితో కలిసి సాంకేతిక ఆధారాలు, అనుమానితుల కదలికలను పరిశీలించి అదే గ్రామానికి చెందిన నిందితుడు చౌహాన్ సాయి o/శీ మోతిలాల్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకున్నాడు.నిందితుడి వద్ద నుంచి దొంగలించబడిన రూ. 70,000 నగదును పూర్తి స్థాయిలో రికవరీ చేసి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు బోథ్ సీఐ డి. గురుస్వామి తెలిపారు.ప్రజలు తమ ఇళ్లలో నగదు, విలువైన వస్తువుల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం వెంటనే పోలీసులకు అందించాలని సూచించారు.




# విజయ్ ప్రభుత్వం కుప్పకూలడం ఖాయం

## - సొంత బలం లేకపోవడమే అతిపెద్ద బలహీనత

## - తమిళనాడు మాజీ సిఎం స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు

**చెన్నై,మే19 నేషనలిస్ట్ వాయిస్)**

ప్రముఖ సినీ నటుడు విజయ్ నేతృత్వంలో కొత్తగా ఏర్పడిన టీవీకే ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చని డీఎంకే అధినేత, మాజీ సీఎం ఎం.కె. స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. విజయ్ ప్రభుత్వం పూర్తిస్థాయి మద్దతు లేక అస్థిరంగా ఉందని, ఎప్పుడైనా కూలిపోయే అవకాశం ఉన్నందున డీఎంకే శ్రేణులు ముందస్తు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. డీఎంకే కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ..ప్రస్తుత ప్రభుత్వం ఏక్షణమైనా కూలిపోవచ్చుఅని, డీఎంకే పార్టీ కార్యకర్తలు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. సొంతంగా 107 సీట్లు సాధించిన టీవీకే మిత్రపక్షమైన కాంగ్రెస్ 5 సీట్లు, సీపీఐ 2, సీపీఎం 2, వీసీకే 2 సీట్లు సాధించిన డీఎంకే మిత్రపక్షాల మద్దతుతో ప్రభుత్వం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతు ఇస్తున్న తమ మిత్రపక్షాలైన వీసీకే, సీపీఐ, సీపీఎం, ఐయూఎంఎల్ మద్దతు నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నా, లేదా తమిళనాడు స్పీకర్ గానీ, కోర్టులు గానీ రెబెల్ ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేలను చివరికి అనర్హులుగా ప్రకటించినా రాజకీయ అస్థిరత ఏర్పడవచ్చని పేర్కొన్నారు. గతంలో ఎన్నికల పరాజయాల నుండి డీఎంకే ఎలా పుంజుకుందో గుర్తు చేశారు. 2029 లోక్‌సభ ఎన్నికలతో పాటు మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ ఓటమి తాత్కాలికమైందని, తాము మళ్లీ విజయం సాధిస్తామని కార్యకర్తలకు భరోసానిచ్చారు. తమిళనాడులో సూర్యుడు (డీఎంకే గుర్తు) ఎప్పటికీ అస్తమించడు' అని స్టాలిన్ స్పష్టం చేశారు. ఓటమికి వ్యక్తిగత బాధ్యత తీసుకుంటానని, సోషల్ మీడియాలో పార్టీపై వచ్చే విమర్శలను తిప్పికొట్టాలన్నారు. ఈ విషయంలో టీవీకే చాలా ముందుందని పరోక్షంగా సూచించారు. ఒకప్పుడు మనం టీ దుకాణాల్లో మాట్లాడిన రాజకీయాలను ఇప్పుడు సోషల్ మీడియా వేదికలపై మాట్లాడాలని సూచించారు.

# వైద్యం కోసం రూ.20 వేలు ఆర్థిక సాయం చేసిన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

**తాడేపల్లిగూడెం ప్రతినిధి మే 19 నేషనలిస్ట్ వాయిస్)**

తాడేపల్లిగూడెం మండలంలోని పుల్లాయ గూడెం గ్రామానికి చెందిన తానంకి శ్రీనివాస్ ఇటీవల ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ తన సొంత నిధులు రూ 20 వేల రూపాయలను మెరుగైన చికిత్స నిమిత్తం తానంకి శ్రీనివాస్ కు మంగళవారం స్థానిక కార్యాలయంలోఅందజేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అనే భావంతో తన శక్తి మేరకు పేదలకు ఆర్థిక సహకారం అందిస్తున్నానని తెలిపారు. జనసేన అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాల మేరకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.ఆపదలో ఆదుకున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కు తానంకి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడపా ప్రసాద్, అడ్డగర్ల సురేష్, పాలూరి వెంకటేశ్వరరావు, మైలవరపు గోపాలకృష్ణ, మద్దాల మణికుమార్, మైలవరపు రాజేంద్రప్రసాద్, నల్లగంచి రాంబాబు, బేతిన గిరి, రామ లక్ష్మణ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



# కోయిల్ సాగర్ ప్రాజెక్టు వద్ద పర్యాట లకు వసతులు కల్పిస్తాం

## - జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్త..

**దేవరకద్ర మే 19నేషనలిస్ట్ వాయిస్**

ఉమ్మడి పాలమూరు జిల్లాలో మధ్యతరహా భారీ ప్రాజెక్టు అయిన కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ వద్ద పర్యాటకుల కోసము వసతులు కలిపించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా అన్నారు. మంగళవారము మండల పరిధిలోని కోయిల్ సాగర్ ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ సందర్శించారు. తదుపరి ప్రజాపాలన ప్రగతి పాలన 99 రోజుల ప్రణాళిక పై సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు వద్ద పర్యాటలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రభుత్వం కూడా అన్ని విధాల ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందనిఆమె చెప్పారు. తెలంగాణ ప్రజాపాలన ప్రభుత్వం కూడా కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దెందుకు అన్ని విధాలా కృషి చేయడం జరుగుతుందని ఆమెతెలిపారు. అలాగే నాగారం గ్రామంలో కూడా వరి కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీచేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంబడి జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, తాసిల్దార్ హర్షద్, ఎంపీడీవో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.





# ఆదిలాబాద్ జిల్లాలో మండుటెండలు

## - జనం బయటకు రాలేక నానా తిప్పలు

**ఆదిలాబాద్,మే19 నేషనలిస్ట్ వాయిస్)**

ఆదిలాబాద్ జిల్లాలో భానుడి ప్రతాపం కొనసాగుతున్నది. సోమవారం 44.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కాగా.. మంగళవారం కూడా అదే పరిస్థితి నెలకొంది. మండుటెండల తో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు. ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఎండ తీవ్రత.. సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగుతున్నది. ఎండకు వడగాలులు తోడవడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారులు జనసంచారం లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు గొడుగులు, టోపీలు, తలకు టవల్స్ చుట్టుకుంటున్నారు. మంచినీరు, మజ్జిగ, లస్సీ ఇతర చల్లని పానీయాలు తీసుకుంటున్నారు. మరో నాలుగు రోజులపాటు ఎండ తీవ్రత ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని.. ఉదయం, సాయంత్రం పనులు చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

# ధరల సెగ: జీలుగుమిల్లిలో 'సిపిఎం' రాస్తారోకో!

## - పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఎరువుల ధరలను తక్షణమే తగ్గించాలి

## - కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై సిపిఎం నేతలు ఆర్. లింగరాజు, కె. శ్రీనివాస్ నిప్పులు






**జీలుగుమిల్లి, మే 19 నేషనలిస్ట్ వాయిస్):**

కేంద్ర ప్రభుత్వం నిరంతరం పెంచు కుంటూ పోతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్, మరియు ఎరువుల ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జీలుగుమిల్లిలో సిపిఎం ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారిపై బైఠాయించిన నిరసనకారులు కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. అలాగే ముఖ్య డిమాండ్లు తెలియజేస్తూ పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ మరియు నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించి సామాన్యుడికి అందుబాటులోకి తేవాలి. అలాగే ఎరువులపై ఇచ్చే సబ్సిడీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే పూర్తిగా భరించాలి. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన రైతు వ్యతిరేక ఎరువుల బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలి. యూరియా కొరతను సాకుగా చూపి, రైతులకు అవసరం లేని ఇతర మందులను అంటగట్టే విధానాన్ని ఆపాలి. బ్లాక్ మార్కెట్లను అరికట్టాలి. "ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో అన్నదాత కనుమరుగవుతాడు" అని తెలుపుతూ అంతేకాకుండా "కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు వ్యవసాయ రంగాన్ని కుదేలు చేస్తున్నాయి. పెట్టుబడులు భరించలేక కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు లేదా వలసలు పోతున్నారు. డీజిల్ ధరల పెంపుతో ట్రాక్టర్లు, వరికోత యంత్రాల ఖర్చులు భారంగా మారాయి. ఇలాగే వదిలేస్తే దేశం తిండిగింజల కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సి వస్తుంది." అని ఆర్. లింగరాజు (సిపిఎం జిల్లా కార్యదర్శి), కె. శ్రీనివాస్ (జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు) తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కన్వీనర్ సిరిబత్తుల సీతారామయ్య, మండల కమిటీ సభ్యులు తెల్లం శంకరుడు, పోవడం గంగరాజు, గుండె గంగరాజు, చిట్టిబొమ్మ కొండలరావు, కారం నాగదుర్గ, బోడమ్మ, మరియు రైతు సంఘం నాయకులు జానకిరామ్ రెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మరణంలోనూ 'చూపు'నిచ్చిన మహానుభావుడు!

## - కంటిదానంతో ఆదర్శంగా నిలిచిన మాజీ సర్పంచ్ పోతిరెడ్డి శ్రీరామచంద్రమూర్తి

## - ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపిన మానవతా నిర్ణయం

## - దొండపూడి గ్రామంలో విషాద ఛాయలు; కుటుంబ సభ్యులపై ప్రశంసల జల్లు

**గోపాలపురం, మే 19 నేషనలిస్ట్ వాయిస్):**





జీవితాంతం గ్రామాభివృద్ధి కోసం శ్రమించిన ఆయన, మరణించిన తర్వాత కూడా ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపి మానవత్వానికి నిలువెత్తు రూపంగా నిలిచారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం దొండపూడి గ్రామానికి చెందిన ప్రముఖ సీనియర్ సిటిజన్, మాజీ సర్పంచ్, పంచాయతీ స్థలదాత పోతిరెడ్డి శ్రీరామచంద్రమూర్తి (86) అకాల మరణం చెందారు. ఆయన మృతితో దొండపూడి గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. శ్రీరామచంద్రమూర్తి జీవితాంతం ప్రజాసేవలోనే గడిపారు. ఆయన మరణానంతరం కూడా ఆ సేవా నిరతిని కొనసాగించేలా కుటుంబ సభ్యులు ఒక గొప్ప నిర్ణయం తీసుకున్నారు. శ్రీరామచంద్రమూర్తి భౌతిక కాయం నుండి రెండు కళ్లను నిడదవోలుకు చెందిన 'రాజరాజేశ్వరి రామకృష్ణ లయన్స్ క్లబ్' వారికి దానం చేశారు. ఈ కంటిదానం ద్వారా దృష్టి లోపంతో బాధపడుతున్న ఇద్దరు వ్యక్తులకు తిరిగి చూపు వచ్చే అవకాశం కలగడం విశేషం. అలాగే "సమాజానికి సేవ చేయాలనే తపన ఉన్న వ్యక్తి, మరణించిన తర్వాత కూడా మరొకరికి చూపునివ్వడం కంటే గొప్ప ఆదర్శం మరొకటి లేదు." అని స్థానికులు కొనియాడారు. శ్రీరామ చంద్రమూర్తి మృతి పట్ల గ్రామస్థులు, పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధికి ఆయన చేసిన సేవలను, పంచాయతీ భవన నిర్మాణానికి స్థలాన్ని దానం చేసిన ఆయన ఉదారతను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. దుఃఖంలో ఉంటూనే, సమాజ హితం కోసం కంటిదానానికి ముందుకు వచ్చిన శ్రీరామచంద్రమూర్తి కుటుంబ సభ్యుల మానవతా నిర్ణయాన్ని పలువురు ముక్తకంఠంతో అభినందించారు. ఈ ఘటన స్ఫూర్తితో ప్రజల్లో కంటి దానంపై మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడ్డారు. శ్రీరామ చంద్రమూర్తి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ గ్రామ ప్రజలు ఆయనకు ఘన నివాళులర్పించారు.

# జాతీయ స్థాయి పారా త్రోబాల్ క్రీడాకారుడికి రూ. 50 వేల ఆర్థిక సాయం

## - ప్రతిభను అభినందించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

## - క్రీడాకారుడికి అండగా ఉంటామని హామీ

**గిద్దలూరు, మే 19 నేషనలిస్ట్ వాయిస్):**




శారీరక సవాళ్లను అధిగమించి, కఠిన శ్రమతో జాతీయ స్థాయికి ఎదిగిన క్రీడాకారుల ప్రతిభ సమాజానికి ఎంతో గర్వకారణమని గిద్దలూరు నియోజక వర్గ శాసనసభ్యులు శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి కొనియాడారు. బెస్తవారి పేట మండలం ఆర్. కొత్తపల్లి గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థి 'పండుగల రాయుడు' ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి నుండి జాతీయ స్థాయి ప్యారా త్రో బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా క్రీడాకారుడి ప్రతిభను గుర్తించిన ఎమ్మెల్యే అశోక్ రెడ్డి, అతన్ని ప్రత్యేకంగా అభినందిస్తూ భవిష్యత్తు అవసరాల కోసం రూ. 50,000/- (యాభై వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని అందజేశారు. శాప్ చైర్మన్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే క్రీడాకారుడు రాయుడికి మరింత మెరుగైన శిక్షణ, సదుపాయాలు కల్పించేలా చూడాలని కోరుతూ ఎమ్మెల్యే అశోక్ రెడ్డి క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ రవి నాయుడుతో ఫోన్ ద్వారా మాట్లాడారు. గ్రామీణ మరియు వెనుకబడిన ప్రాంతాల నుండి వచ్చే ఇలాంటి ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రభుత్వం మరియు ప్రజాప్రతినిధుల నుండి లభించే ప్రోత్సాహం ఎంతో ఊరటనిస్తుందని, వారిలో ఆత్మ విశ్వాసాన్ని నింపుతుందని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు. పండుగల రాయుడు జాతీయ స్థాయిలో మరింతగా రాణించి, మన ప్రాంతానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు ఎమ్మెల్యే చేతుల మీదుగా జరిగిన ఈ ఆర్థిక సహాయం మరియు ప్రోత్సాహక కార్యక్రమంలో కంభం మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనూరి భూపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ దప్పిలి భాస్కర్ రెడ్డి తదితర స్థానిక నాయకులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు. ప్రతిభ ఉన్న క్రీడాకారుడికి తక్షణమే స్పందించి అండగా నిలిచిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డికి గ్రామస్తులు, క్రీడా సంఘాల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## - ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

### - బుట్టాయగూడెం 'జనవాణి'లో అర్జీల స్వీకరణ


### - నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అధికారులకు హెచ్చరిక





బుట్టాయగూడెం, మే 19 నేషనలిస్ట్ వాయిస్):

ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజల నుండి వచ్చే ప్రతి వినతిని బాధ్యతగా స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తామని ఏలూరు జిల్లా పోలవరం నియోజకవర్గ శాసనసభ్యులు చిర్రి బాలరాజు స్పష్టం చేశారు. మంగళ వారం బుట్టాయగూడెం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యా లయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'జనవాణి' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బాలరాజుకు అధికారులు, కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రజల నుండి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరి ంచారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను ఒక్కొక్కటిగా తెలుసు కుంటూ, అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులతో చర్చించి తక్షణ పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. ప్రధానంగా భూ సమస్యలు, రేషన్ కార్డులు, పింఛన్లు, తాగునీటి ఎద్దడి, రహదారుల మరమ్మత్తులు, విద్యుత్ సమస్యలు, ఉపాధి హామీ పనులు, వైద్య సేవలు, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన పలు వినతులను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా ఒకే వేదికపై వారి సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశం తోనే 'జనవాణి' కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నామని తెలిపారు. అధికారులు ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించకుండా తక్షణమే స్పందించా లని, ప్రతి వినతిపై నిర్దిష్ట గడువులోగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, గ్రామీణ రహదారుల నిర్మాణం, తాగునీటి సౌకర్యాలు, వైద్య, విద్యా రంగాల బలోపేతంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అలాగే "ప్రజల నమ్మకంతోనే మేము ప్రజాప్రతి నిధులుగా ఉన్నాం. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి." అని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు తెలిపారు. అంతేకాకుండా జనవాణి కార్యక్రమానికి నియోజకవర్గ



నలుమూలల నుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు. ప్రజల సమస్యలను ఓర్పుగా విని, సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు స్థానికులు కృతజ్ఞ తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో రాములు నాయక్, తహసీల్దార్ రాధాకృష్ణ, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. కూటమి తరపున జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, మండల అధ్యక్షుడు బుచ్చిరాజు, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ పాదం కృష్ణ, టీడీపీ నాయకులు కృష్ణమోహన్, కరాటం సునీల్, మారిశెట్టి అనిల్, కొప్పుల రాజేష్, పూనెం రాజా, తీగల గోపాలకృష్ణ, త్రుష్టి వెంకటేష్, సింగంశెట్టి మనోహర్, పద్మరాజు, నాగు, ఏలేటి ఏడుకొండలు తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాలమూరు రంగారెడ్డి సాగునీటి ప్రాజెక్టు పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి.. మంత్రులకు ఎమ్మెల్యేలకు సీఎం ఆదేశం..

దేవరకద్ర మే 19 నేషనలిస్ట్ వాయిస్

ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి జిల్లా మంత్రులకు ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి,పలు కీలక సూచనలు చేశారు. మంగళవారం ఎం సి ఆర్ హెచ్ ఆర్ డి లో ఉమ్మడి పాలమూరు జిల్లా మంత్రులు ఎమ్మెల్యేలతో సీఎం కీలక సమావేశం నిర్వహించారు.పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను దగ్గరుండి యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయించాలని సీఎం ఆదేశించారు.జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలయినంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని సిఎం తెలిపారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లాలోని ఇతర సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన మంత్రులు, ఎమ్మెల్యేలు.సానుకూలంగా సీఎం స్పందించిన రు.జిల్లాలో సమస్యల పరిష్కారం, పనుల్లో పురోగతిపై మంత్రుల ఆధ్వర్యంలో తరుచూ తనను కలవాలని సీఎం కోరారు.ఈ భేటీలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాకేశ్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్లకృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు పాల్గొన్నారు.





# ఎస్సీ, ఎస్టీలను టిడిపికి దూరం చేసేలా వైసిపి తీరు

### - వైసీపీ హయాంలో సుబ్రహ్మణ్యం, సుధాకర్ హత్య
### - కూటమి ప్రభుత్వంలో ఎంతటి వారైనా చర్యలు
### - 22న మినీ మహానాడు నిర్వహణపై స్పష్టతనిస్తాం
### - పెట్రోలు, డీజిల్ ధరల పెంపులో రాష్ట్రం ప్రమేయం ఉండదు
### - విలాసవంత ప్రయాణాలను వాయిదా వేసుకోవాలి
### - టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ వలవల బాజ్జీ

తాడేపల్లిగూడెం ప్రతినిధి మే 19 నేషనలిస్ట్ వాయిస్)

వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్సీ అనంత బాబు చేతిలో సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి హత్యకు గురై నాలుగేళ్లు కావస్తుందని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లిఖార్జునరావు ( బాజ్జీ) తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన మంగళవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాజ్జీ మాట్లాడుతూ ఎస్సీలను నాటి వైసిపి ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేసిందన్నారు. సుబ్రహ్మణ్యం హత్య కేసులో సస్పెండైన అనంత బాబును వైసీపీ తిరిగి ఎలా తన పంచన చేర్చుకుందో అర్థం కావడం లేదని, ఆయనపై ఉన్న నేరారోపణలు వీగిపోయాయా అని ప్రశ్నించారు. ఆయన సాక్షులను బెదిరించిన పరిస్థితి ఉందన్నారు. పూర్తి విచారణలో సుబ్రహ్మణ్యం హత్యలో అనంతబాబు భార్య హస్తం ఉందనే ప్రచారం సాగిందన్నారు. ప్రజలు ఏమనుకుంటున్నారని విషయాన్ని మరిచిపోయి అనంతబాబు ఇంటర్వ్యూ ఇవ్వడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సుబ్రహ్మణ్యంను హత్య చేసినట్లు స్వయంగా అనంతబాబు అంగీకరించాడని గుర్తు చేశారు. నాడు డాక్టర్ సుధాకర్ హత్యకు వైసీపీ ప్రభుత్వం కారణమైందన్నారు. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలపై అత్యాచారాలు జరిగినా వైసీపీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందన్నారు. నేటి కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదన్నారు. ఎస్సీల పట్ల అనుచితంగా ప్రవర్తించిన నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు నేరాలను ప్రోత్సహించలేదన్నారు. టీడీపీకి ఎస్సీ, ఎస్టీల నుంచి 40 శాతం ఓటు బ్యాంకు ఉందన్నారు. ఆయా సామాజిక వర్గాల నుంచి ఎంతోమంది ప్రజాప్రతినిధులు ఉన్నారన్నారు. ఆయా వర్గాల మద్దతును టీడీపీకి దూరం చేసేందుకు వైసీపీ చేసే ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కూటమిలో ఎస్సీలపై అకృత్యాలకు పాల్పడితే చట్టప్రకారం ఎంతటి వారైనా క్షమించమని, అరెస్టు చేసి జైలుకు పంపిస్తామన్నారు.

**మినీ మహానాడు నిర్వహణపై స్పష్టతనిస్తాం :**

పట్టణంలో ఈ నెల 22న నిర్వహించనున్న మినీ మహానాడుపై త్వరలో స్పష్టతనిస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ వలవల బాజ్జీ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు సీఎం చంద్రబాబు పొదుపు కార్యాచరణ చేపట్టారన్నారు. దీనిలో భాగంగానే జూమ్ కాన్ఫరెన్స్ లు, స్క్రీన్లు ఏర్పాటు చేసి, ఎక్కడికక్కడ మహానాడు కార్యక్రమాలు నిర్వహించా లని ఆదేశించినట్లు తెలిపారు. అయితే, ఈ విషయంలో కొన్ని ఇబ్బందులు న్నాయని పార్టీకి తెలియజేశామన్నారు. నియోజకవర్గంలో ఒకే చోట లేదా




టౌన్, మండలాలకు వేర్వేరుగా నిర్వహించే విషయాన్ని పార్టీ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ విషయాన్ని జిల్లా పార్టీ అధ్యక్షులు రామరాజు రాజ్యసభ సభ్యురాలు సీతారామలక్ష్మి ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, రాధాకృష్ణ సంఘటితంగా పార్టీకి రిప్రజెంట్ చేసామన్నారు. పార్టీ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు త్వరలో కార్యాచరణను మీడియాకు, పార్టీ శ్రేణులకు వెల్లడిస్తామన్నారు.

**ఇంధన ధరల పెంపులో రాష్ట్ర ప్రమేయం లేదు :**

పెట్రోల్, డీజిల్ ధరల పెంపు విషయంలో రాష్ట్ర ప్రమేయం లేదని, కేంద్రం నిర్ణయించిన ధరలను రాష్ట్రంలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. గత మూడు నెలలుగా జరుగుతున్న యుద్ధ పరిణామాల నేపథ్యంలో తప్పనిసరి పరిస్థితుల్లో ధరలను పెంచినట్లు గుర్తు చేశారు. తాజాగా మరో 90 పైసలు ఇంధన ధర పెరిగిందన్నారు. వెసులుబాటు ఉన్న వారు ఎలక్ట్రికల్ వాహనాలను వినియోగించాలని సూచించారు. రైతులకు అవసరమైన ఇంధన సరఫరాలో వెనుకాడేది లేదని స్పష్టం చేశారు. వర్క్ ఫ్రం హోం వంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. రవాణా రంగం ఆగితే ప్రపంచం ఆగిపోయే పరిస్థితి ఉందన్నారు. విలాస ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, బండారు వెంకటరావు, గంధం సతీష్, గురుజు సూరిబాబు, ముప్పిడి రమేష్, పోనుకుమాటి గంగరాజు,మద్దుకూరి ధనరాజ్, దాట్ల జగన్నాథరాజు, ఎరుబండి సతీష్, సీలి వెంకటాచలం, కిలాడి సాయి, మార్లపూడి మహేష్, దలై తిరుమల రావు, బాదంపూడి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా పరిశోధనలు సాగాలి

## - ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం ప్రతినిధి మే 19 నేషనలిస్ట్ వాయిస్)

రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా ఉద్యాన విశ్వ విద్యాలయం సరికొత్త ఆలోచనలతో పరిశోధనలు నిర్వహించాలని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. తాడేపల్లిగూడెం మండలం, వెంకట్రామన్నగూడెంలోని డా.వై.ఎస్. ఆర్.ఉద్యాన విశ్వవిద్యాలయంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో తేనె పెట్టెల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో ఉద్యాన విశ్వవిద్యాలయం ఉండటం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ప్రధాని మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రైతుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు చేపట్టారని, అందుకనుగుణంగా విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఆలోచనలు చేయాలన్నారు. అంతర పంటల విషయంలో రైతులకు మెరుగైన సలహాలు, సూచనలు అందిస్తే వివిధ రకాల వాణిజ్య పంటలు సాగు చేసి ఆదాయాన్ని పెంచుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. కొబ్బరిలో అంతర్ పంటగా కోకో, పోక చెక్క వంటి పంటలను రైతులు సాగు చేసి మంచి ఆదాయాన్ని సాధిస్తున్నారన్నారు. ఆయా భూముల రకాలను బట్టి ఏఏ పంటలు వేస్తే మరింత లాభసాటిగా ఉంటుందనే విషయంపై రైతులకు అవగాహన కలిపించాలని సూచించారు. వ్యవసాయాన్ని పరిశ్రమగా అభివృద్ధి చెందే విధంగా కృషి చేయాలని అన్నారు. వ్యవసాయ, ఉద్యాన వాణిజ్య పంటల్లో ఈ ప్రాంతం ప్రథమ స్థానంలో ఉండే విధంగా విశ్వవిద్యాలయం అధికారులు కృషి చేయాలని వివరించారు. అనంతరం తేనెటీగల పెంపకం దారులకు సబ్సిడీ పై తేనే పెట్టెలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ కె.ధనుంజయరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అధికారులతోపాటు నాయకులు పాలూరి వెంకటేశ్వరరావు, పుల్లా బాబి, పసుమర్తి రామ లక్ష్మణ్, వర్తనపల్లి కాశి వాడపల్లి సుబ్బరాజు, కొనగల హరినాథ్, పసల కొండ అరసాల నారాయణ, కేతిరెడ్డి రాంబాబు, వేదపూడి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.





# పంత్ కెరీర్ ముగిసినట్లేనా..?

ఐపీఎల్ 2026 ముగియక ముందే భారత క్రికెట్‌లో మరో భారీ ట్విస్ట్ చోటుచేసుకుంది. ఆఫ్ఘనిస్తాన్‌తో జూన్ 6 నుంచి ప్రారంభమయ్యే ఏకైక టెస్టు కోసం బీసీసీఐ ప్రకటించిన జట్టులో అత్యంత హాట్ టాపిక్‌గా మారింది రిషబ్ పంత్ డిమోషన్. టీమ్‌ఇండియా భవిష్యత్ నాయకుల్లో ఒకడిగా భావించిన పంత్‌ను టెస్టు వైస్ కెప్టెన్సీ నుంచి తప్పిస్తూ.. అనుభవజ్ఞుడు కేఎల్ రాహుల్‌కు ఆ బాధ్యతలు అప్పగించారు. ఈ నిర్ణయం ఇప్పుడు భారత క్రికెట్ వర్గాల్లో పెద్ద చర్చకు దారి తీసింది. రోహిత్ శర్మ టెస్టులకు వీడ్కోలు పలికిన తర్వాత భారత జట్టులో నాయకత్వ మార్పులు వేగంగా జరిగాయి. యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌ను టెస్టు కెప్టెన్‌గా ఎంపిక చేసిన సెలెక్టర్లు.. అప్పట్లో రిషబ్ పంత్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. కానీ ఇప్పుడు కేవలం కొద్ది కాలంలోనే పంత్ నుంచి ఆ బాధ్యతలను తీసేసి, కేఎల్ రాహుల్‌కు అప్పగించడం గమనార్హం. జూన్ 6 నుంచి ముల్లన్‌పూర్ వేదికగా ప్రారంభమయ్యే ఈ టెస్టులో శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా జట్టును నడిపించనున్నాడు. అతనికి డిప్యూటీగా కేఎల్ రాహుల్ వ్యవహరించనున్నాడు. ఈ మార్పుతో టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ భవిష్యత్ నాయకత్వంపై స్పష్టమైన సంకేతాలు ఇచ్చిందని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. రిషబ్ పంత్‌ను వైస్ కెప్టెన్సీ నుంచి తొలగించడం ఒక్కసారిగా తీసుకున్న నిర్ణయం కాదని తెలుస్తోంది. దీనికి పలు కారణాలు ఉన్నాయని బీసీసీఐ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా కెప్టెన్సీ ఒత్తిడి అతని సహజమైన దూకుడు బ్యాటింగ్‌ను ప్రభావితం చేస్తోందనే అభిప్రాయం సెలెక్టర్లలో బలపడిందని సమాచారం. ఐపీఎల్ 2026లో లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్‌గా పంత్ ప్రదర్శన తీవ్ర విమర్శలకు గురైంది. బ్యాటింగ్‌లోనూ అతను ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు.

# ఐపీఎల్ 2027లో ధోనీ ఆడటం కష్టమేనా?



ఐపీఎల్ క్రికెట్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ఫ్యాన్స్‌కు ఎంఎస్ ధోనీ అంటే ఒక ప్లేయర్ మాత్రమే కాదు, అతను ఒక ఎమోషన్. ఈ 2026 సీజన్‌లో ధోనీని మైదానంలో చూడాలి అని ఎంతో మంది ఆశపడ్డా, గాయం కారణంగా ఒక్క మ్యాచ్‌లోనూ బ్యాట్ పట్టలేదు. దీంతో అభిమానులు తీవ్ర నిరాశలో మునిగిపోయారు. అయితే సోమవారం రాత్రి చెపాక్ మైదానంలో ఒక అద్భుతమైన సీన్ హైలెట్ అయ్యింది. మ్యాచ్ ముగిసిన తర్వాత ధోనీ గ్రౌండ్‌లోకి అడుగు పెట్టడంతో స్టేడియం మొత్తం మారుమోగిపోయింది. కానీ అదే సమయంలో ఆయన తన ప్రాణ స్నేహితుడు, మాజీ సహచరుడు సురేష్ రైనాతో అన్న కొన్ని మాటలు ఇప్పుడు ఫ్యాన్స్ గుండెల్ని పిండేస్తున్నాయి. సోమవారం రాత్రి చెన్నైలోని చేపాక్ స్టేడియంలో సన్ రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య కీలక మ్యాచ్ జరిగింది. ఈ హోరాహోరీ పోరులో చెన్నై జట్టు 5 వికెట్ల తేడాతో ఎస్ఆర్‌హెచ్ చేతిలో ఓటమి పాలైంది. ఈ ఓటమితో ఫ్యాన్స్ నిరాశ చెందినప్పటికీ, మ్యాచ్ ముగిసిన తర్వాత వాళ్లకు ఒక పెద్ద సర్ ప్రైజ్ దొరికింది. ఈ సీజన్‌లో హోమ్ గ్రౌండ్‌లో సీఎస్‌కేకి ఇదే ఆఖరి మ్యాచ్ కావడంతో, ఎంఎస్ ధోనీ మైదానంలోకి వచ్చారు. టీమ్ మెంబర్స్‌తో కలిసి ఫొటోలు దిగడమే కాకుండా, స్టేడియం మొత్తం చుట్టూ తిరుగుతూ అభిమానులకు అభివాదం చేశారు. ఈ ల్యాప్ ఆఫ్ ఆనర్ చూస్తుంటే ధోనీ ఇక క్రికెట్‌కు పూర్తిగా గుడ్ బై చెప్పేస్తున్నారా అన్న అనుమానాలు ఫ్యాన్స్‌లో మొదలయ్యాయి. ఈ మ్యాచ్‌కు కామెంటేటర్‌గా వచ్చిన సురేష్ రైనా, గ్రౌండ్‌లో ధోనీని కలిసి కాసేపు ముచ్చటించారు. ఈ ఇద్దరు దిగ్గజాలు చెన్నై జట్టుకు ఎన్నో గొప్ప విజయాలు అందించారు. ఈ సందర్భంగా రైనా ఐపీఎల్ 2027లో ఆడటం గురించి ధోనీని అడిగారు. ఆ సంభాషణ వివరాలను రైనా స్వయంగా వెల్లడించారు. "నేను ధోనీతో అన్నాను.. నువ్వు ఐపీఎల్ 2026కి ఎలాగో మిస్స్ డ్ కాల్ ఇచ్చావు కాబట్టి ఇది కౌంట్ అవ్వదు, నువ్వు కచ్చితంగా వచ్చే ఏడాది ఆడాల్సిందే అని చెప్పాను. దానికి ధోనీ స్పందిస్తూ.. నా శరీరం ఇప్పుడు కొంచెం బలహీనపడింది, మునుపటిలా సహకరించడం లేదు అని అన్నాడు" అని రైనా చెప్పారు. ధోనీ నోటి నుంచి ఈ మాట వినడంతో అభిమానులు ఎమోషనల్ అవుతున్నారు. ధోనీ ఆ మాట అన్నప్పటికీ రైనా మాత్రం వదిలి పెట్టలేదు. "నువ్వు ఏం చెప్పినా మేము నమ్మం, వచ్చే ఏడాది నువ్వు ఖచ్చితంగా గ్రౌండ్‌లోకి రావాల్సిందే అని నేను ధోనీతో గట్టిగా చెప్పాను" అని రైనా నవ్వుతూ గుర్తు చేసుకున్నారు. అయితే వచ్చే ఏడాది ఆడాలా వద్దా అనేది పూర్తిగా ధోనీ వ్యక్తిగత నిర్ణయం అని, ఆయన ఎప్పుడూ పాజిటివ్‌గానే ఆలోచిస్తారని రైనా ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం టీమ్‌లోని యువ ఆటగాళ్లతో ధోనీ మంచి అనుబంధాన్ని కలిగి ఉన్నారని, ఆయన జట్టుతో కలిసి ప్రయాణించడం ప్లేయర్స్‌లో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని నింపుతోంది అని రైనా వివరించారు. మ్యాచ్ ముగిసిన తర్వాత జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో సీఎస్‌కే హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్‌కు కూడా ధోనీ భవిష్యత్తుపైనే ప్రశ్నలు ఎదురయ్యాయి. దీనిపై ఫ్లెమింగ్ స్పందిస్తూ వచ్చే సీజన్‌లో ధోనీ ఉంటారా లేదా అనేది పూర్తిగా ఫ్రాంచైజీ మేనేజ్‌మెంట్ తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది అని చెప్పారు. "ధోనీ ఈ ఏడాది మ్యాచ్‌లు ఆడకపోయినా జట్టుతోనే ఉన్నాడు. యువ ఆటగాళ్లకు గైడెన్స్ ఇవ్వడంలో ఆయన పాత్ర చాలా పెద్దది. టీమ్‌పై ఆయన ప్రభావం ఎప్పుడూ ఉంటుంది. అయితే వచ్చే ఏడాది ఆడే విషయం మాత్రం మేనేజ్‌మెంట్ చూసుకుంటుంది, ఇచ్చారు.



# సంజు శాంసన్ సరికొత్త రికార్డు

ఇండియన్ ప్రీమియర్ లీగ్  లో మహేంద్ర సింగ్ ధోని సుదీర్ఘకాలంగా ఏలుతున్న ఒక అరుదైన రికార్డుల లిస్టులో సంజు శాంసన్ తన పేరును లిఖించుకున్నాడు. సోమవారం చెపాక్ స్టేడియం వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్  జట్టుతో జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ ఈ అద్భుతమైన ఘనత సాధించాడు. ఒకే ఐపీఎల్ సీజన్ లో సీఎస్‌కే తరపున ఒక వికెట్ కీపర్ గా అత్యధిక పరుగులు చేసిన ఎంఎస్ ధోని రికార్డును ఆయన బద్దలు కొట్టాడు. ఇంతకుముందు ధోని 2013 ఐపీఎల్ సీజన్ లో 16 ఇన్నింగ్స్ ఆడి 461 పరుగులు సాధించాడు. ఈ మార్కును దాటడానికి శాంసన్‌కు మ్యాచ్ ప్రారంభంలో కేవలం 12 పరుగులు మాత్రమే అవసరం అవ్వగా, ఆయన కేవలం ఆరు బంతుల్లోనే 15 పరుగులు చేసి ఆ మైలురాయిని దాటేశాడు. హైదరాబాద్ బౌలర్ నితీష్ కుమార్ రెడ్డి వేసిన మొదటి ఓవర్ లోనే శాంసన్ ఈ స్కోరు అందుకోవడం విశేషం. రికార్డు దాటిన తర్వాత కూడా సంజు శాంసన్ తన అగ్రెసివ్ బ్యాటింగ్ శైలిని అస్సలు ఆపలేదు. రెండో ఓవర్ లో బౌలింగ్‌కు వచ్చిన ప్రఫుల్ హింగే ఓవర్ లో వరుసగా మూడు బౌండరీలు బాది స్టేడియాన్ని హోరెత్తించాడు. కేవలం 11 బంతుల్లోనే 27 పరుగులు చేసి మంచి టచ్ లో కనిపించిన శాంసన్‌ను అడ్డుకోవడానికి సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్ స్వయంగా బౌలింగ్ రంగానికి వచ్చాడు. కమిన్స్ వేసిన ఒక పవర్‌ఫుల్ యార్కర్‌ను శాంసన్ సమర్థవంతంగా డిఫెండ్ చేశాడు. ఆ తర్వాతి బంతిని కమిన్స్ ఆఫ్ స్టంప్‌కు వెలుపల వేయగా, శాంసన్ డ్రైవ్ చేయడానికి ప్రయత్నించాడు. ఆ షాట్ మిస్ అవ్వడంతో బంతి బ్యాట్ ఎడ్జ్ కు తగిలి వికెట్ కీపర్ చేతుల్లోకి వెళ్ళింది. దాంతో శాంసన్ ఇన్నింగ్స్ ముగిసింది. ఓవరాల్ గా చెన్నై సూపర్ కింగ్స్ జట్టులో వికెట్ కీపర్ బ్యాటర్ గా ధోని రికార్డులు అన్-మ్యాచ్‌డ్ గా ఉన్నప్పటికీ, ఈ లిస్టులో ప్రముఖంగా నిలిచిన రెండో ప్లేయర్ గా సంజు శాంసన్ గుర్తింపు తెచ్చుకున్నాడు. ఐపీఎల్ లో ఒకే సీజన్ లో సీఎస్‌కే తరపున 100 కంటే ఎక్కువ పరుగులు చేసిన వికెట్ కీపర్లు కేవలం ముగ్గురు మాత్రమే ఉన్నారు. వారిలో మొదటి వ్యక్తి ఎంఎస్ ధోని కాగా, రెండో ఆటగాడు 2008 సీజన్ లో రాణించిన పార్థివ్ పటేల్. ఇప్పుడు ఈ 2026 సీజన్ లో సంజు శాంసన్ ఆ లిస్టులోకి చేరాడు.






# ఆఫ్ఘనిస్తాన్ వన్డే సిరీస్‌కు భారత జట్టు ప్రకటన

జట్టులోకి హర్ష్ దూబె, గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్ ఐపీఎల్ 2026 ఫీవర్ ముగిసేలోపే టీమ్‌ఇండియా మళ్లీ ఇంటర్నేషనల్ క్రికెట్ మోడ్‌లోకి ఎంటర్ కానుంది. మే 31న ఐపీఎల్ ఫైనల్‌తో మెగా టోర్నీ ముగియనుండగా.. వెంటనే జూన్‌లో అఫ్గానిస్థాన్‌తో కీలక సిరీస్‌కు భారత్ సిద్ధమవుతోంది. స్వదేశంలో జరగనున్న ఈ సిరీస్‌లో ఒక టెస్టు, మూడు వన్డేలు ఉండనున్నాయి. ఈ టూర్ కోసం భారత సీనియర్ సెలక్షన్ కమిటీ తాజాగా జట్లను ప్రకటించింది. ఈసారి జట్టులో యువ ఆటగాళ్లకు పెద్దపీట వేయడం విశేషం. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కారణంగా విశ్రాంతి ఇచ్చారు. మరోవైపు వన్డే జట్టులో రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యలకు చోటు దక్కినా.. వారి ఎంపిక ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పై ఆధారపడి ఉంటుందని సెలెక్టర్లు స్పష్టం చేశారు. చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ మాట్లాడుతూ.. మహ్మద్ షమి విషయంపై సెలక్షన్ కమిటీ చర్చించలేదని తెలిపారు. ఈ సిరీస్‌లో యువ క్రికెటర్లకు భారీ అవకాశం దక్కింది. హర్ష్ దూబె, గుర్నూర్ బ్రార్, ప్రిన్స్ యాదవ్ తొలిసారిగా భారత జట్టులో స్థానం సంపాదించారు. ముఖ్యంగా ప్రిన్స్ యాదవ్ వన్డే జట్టులోనే చోటు దక్కించుకోవడం ఆసక్తికరంగా మారింది. టెస్టు జట్టుకు యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. వైస్ కెప్టెన్‌గా కేఎల్ రాహుల్ వ్యవహరించనున్నాడు.

# గుజరాత్ టైటాన్స్ నుంచి అత్యధికంగా నలుగురు..

బీసీసీఐ మంగళవారం అఫ్గానిస్తాన్‌తో జరగబోయే వన్డే సిరీస్ కోసం 15 మందితో కూడిన టీమిండియాను ప్రకటించింది. శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని ఈ జట్టు ఎంపికలో ప్రస్తుత ఐపీఎల్ 2026 ప్రదర్శనలు స్పష్టమైన ప్రభావాన్ని చూపించాయి. అయితే ఈ జట్టులో ఐపీఎల్ ఫ్రాంచైజీల వారీగా ఆటగాళ్ల ప్రాతినిధ్యం ఎలా ఉందో చూస్తే పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ వన్డే సిరీస్ జట్టులో గుజరాత్ టైటాన్స్ ఫ్రాంచైజీ నుంచి అత్యధికంగా నలుగురు ఆటగాళ్లు చోటు దక్కించుకున్నారు. భారత జట్టును ముందుండి నడిపించబోయే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఈ జాబితాలో మొదటి స్థానంలో ఉన్నాడు. గాయం కారణంగా గత వన్డే సిరీస్‌కు దూరమైన ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ తిరిగి జట్టులోకి వచ్చాడు. ఫాస్ట్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ కూడా తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. అయితే అందరినీ ఆశ్చర్యపరుస్తూ, గుజరాత్ తరపున ఇంకా ఐపీఎల్ అరంగేట్రం కూడా చేయని యువ బౌలర్ గుర్నూర్ బ్రార్‌కు తొలిసారి జాతీయ జట్టు నుంచి పిలుపు రావడం గమనార్హం. ఈ సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ నుంచి ముగ్గురు ఆటగాళ్లను సెలెక్టర్లు ఎంపిక చేశారు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ, 2026 టీ20 ప్రపంచకప్, ఆపై ఐపీఎల్‌లో పరుగుల వరద పారించిన ఇషాన్ కిషన్ భారీ పునరాగమనం చేశాడు. తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డి కూడా వన్డే జట్టులో తన స్థానాన్ని కాపాడుకున్నాడు. ఇక హైదరాబాద్ స్పిన్నర్ హర్ష్ దూబే ఈ ఐపీఎల్‌లో 8 వికెట్లతో రాణించడంతో, అతడికి తొలిసారి భారత జట్టులో అవకాశం కల్పించారు. ముంబై ఇండియన్స్ నుంచి సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా ఎంపికైనప్పటికీ, వీరిద్దరి లభ్యత వారి ఫిట్‌నెస్‌పైనే ఆధారపడి ఉంటుంది. రోహిత్ పిక్క కండరాల గాయంతో, పాండ్యా నడుము నొప్పితో బాధపడుతున్నారు. ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ ఎంపికయ్యారు. పంజాబ్ కింగ్స్ నుంచి ఎడమచేతి వాటం బౌలర్ అర్ష్‌దీప్ సింగ్‌తో పాటు, ఆ జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌ను ఈ సిరీస్‌కు వైస్ కెప్టెన్‌గా నియమించారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు నుంచి రన్ మెషీన్ విరాట్ కోహ్లీ ఒక్కడే జట్టులో ఉన్నాడు. లక్నో సూపర్ జయంట్స్ తరపున ఐపీఎల్‌లో విరాట్ కోహ్లీ వికెట్ తీసి సంచలనం సృష్టించిన యువ ఫాస్ట్ బౌలర్ ప్రిన్స్ యాదవ్‌కు తొలిసారి భారత జట్టులో చోటు దక్కింది. కాగా, ఐదుసార్లు ఛాంపియన్ అయిన చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, రాజస్థాన్ రాయల్స్ జట్ల నుంచి ఒక్క ఆటగాడికి కూడా ఈ 15 మంది జట్టులో చోటు దక్కకపోవడం అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.


# కురుప్ప వసూళ్ల సునామీ

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, త్రిష జంటగా ఆర్జే బాలాజీ దర్శకత్వంలో తెరకెక్కిన మైథలాజికల్ యాక్షన్ డ్రామా 'కరుప్పు' బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట కొనసాగిస్తోంది. ఈ చిత్రం కేవలం 4 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.150 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి సంచలనం సృష్టించింది. వారాంతంలోనే కాకుండా వర్కింగ్ డే అయిన సోమవారం కూడా ఈ సినిమా థియేటర్లలో భారీ వసూళ్లను సాధించింది. అడ్వాన్స్ బుకింగ్స్ కూడా ట్రెండీగా, చాలా స్టాం÷-రగ్‌గా ఉన్నాయి. ఈ జోరు చూస్తుంటే సూర్య సినీ కెరీర్‌లోనే అత్యధిక వసూళు సాధించిన చిత్రంగా 'కరుప్పు' నిలవడం ఖాయంగా కనిపిస్తోంది. పాత రికార్డులను తిరగరాస్తూ దూసుకుపోతున్న ఈ చిత్రం త్వరలోనే రూ.200 కోట్ల క్లబ్‌లో చేరే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



# నేడు ఎన్టీఆర్ బర్త్‌డే
## అర్ధరాత్రికి డ్రాగన్ గ్లింప్స్ విడుదల

యంగ్ టైగర్ ఎన్టీఆర్, సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవైటెడ్ పాన్-ఇండియా చిత్రం నుంచి ఎట్టకేలకు ఒక భారీ అప్‌డేట్ వచ్చేసింది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ పుట్టినరోజు మే 20 పురస్కరించుకుని, మేకర్స్ అభిమానుల కోసం ఒక అద్భుతమైన సర్ప్రైజ్ ప్లాన్ చేశారు. ఈ రోజు అర్ధరాత్రి సరిగ్గా 11:52 గంటలకి ఈ చిత్రం యొక్క ఫస్ట్ గ్లింప్స్ డిజిటల్ ఎ÷-లాట్‌ఫార్మ్‌తో పాటు, ఎంపిక చేసిన థియేటర్లలో భారీ ఎత్తున విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో గట్టి టాక్ వినిపిస్తోంది. సెన్సార్ బోర్డ్ వెబ్‌సైట్‌లో కూడా 'గ్లింప్స్ ఆఫ్ డ్రాగన్' పేరుతో సర్టిఫికేట్ పొందినట్లు సమాచారం రావడంతో అభిమానుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. ఈ రాత్రి గ్లింప్స్ ద్వారా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. సాధారణంగా వచ్చే టీజర్లు లేదా గ్లింప్స్‌లు ఒకటి లేదా రెండు నిమిషాలు మాత్రమే ఉంటాయి. కానీ, ప్రశాంత్ నీల్ ఈసారి భిన్నంగా ఏకంగా 4 నిమిషాల 35 సెకన్ల రన్ టైమ్‌తో ఈ గ్లింప్స్‌ను కట్ చేసినట్లు తెలుస్తోంది. సినిమా యొక్క కథా నేపథ్యాన్ని, ఆ ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేయడం కోసమే ఇంత సుదీర్ఘమైన విజువల్స్‌ను ప్లాన్ చేశారట. మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ హై బ్జడెట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో కన్నడ బ్యూటీ రుక్మిణీ వసంత్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ అనిల్ కపూర్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాలకు ఊపిరి పోసిన రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ క్రేజీ పాన్-ఇండియా విజువల్ వండర్ జూన్ 11, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.






## 23న భోపాల్‌లో పెద్ది సందడి

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న చిత్రం 'పెద్ది'. జూన్ 4న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రముఖ నగరాల్లో దీని స్పెషల్ ఈవెంట్‌ను నిర్వహించాలని టీమ్ భావిస్తోంది. తాజాగా ముంబయిలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరిగిన విషయం తెలిసిందే. దీని తర్వాత మే 23న మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఏఆర్ రెహమాన్‌తో లైవ్ కాన్సర్ట్‌ను నిర్వహించనున్నారు. భారీ స్థాయిలో జరగనున్న ఈ ఈవెంట్ కోసం టీమ్ పనులు ప్రారంభించింది. తాజాగా భోపాల్‌లోని బీహెచ్‌ఈఎల్ గ్రౌండ్స్‌లో పూజా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇప్పటికే 'పెద్ది'నుంచి వచ్చిన రెండు పాటలు సూపర్ హిట్‌గా నిలిచి కోట్లలో వ్యూస్‌ను సొంతం చేసుకున్నాయి. ఇప్పుడు స్పెషల్ సాంగ్ రానుండడంతో అందరిలో ఆసక్తి నెలకొంది. 'పెద్ది'లో స్పెషల్ సాంగ్ హైలైట్‌గా నిలుస్తుందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో బుచ్చిబాబు తెలిపారు. ఆ పాట ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ బ్లాస్ట్ అని పేర్కొన్నారు. ఇక తాజాగా విడుదలైన 'పెద్ది' ట్రైలర్ అన్ని భాషల్లో కలిపి 63 మిలియన్ల వ్యూస్ వచ్చినట్లు టీమ్ తెలిపింది. అన్ని సోషల్ మీడియా వేదికల్లోనూ అది ట్రెండింగ్‌లో ఉందని పేర్కొంది. రామ్‌చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటిస్తోన్న ఈ సినిమాలో శివరాజ్ కుమార్, జగపతి బాబు కీలకపాత్రల్లో కనిపించనున్నారు.



# కాక్‌టెయిల్-2 విభిన్నమైన మూవీ హీరోయిన్ రష్మిక మందన్నా

వైవిధ్యమైన పాత్రలో ప్రేక్షకుల్ని అలరిస్తూ మెప్పిస్తుంటుంది కథానాయిక రష్మిక. ప్రస్తుతం ఆమె 'కాక్‌టెయిల్ 2' సినిమాతో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. హిందీ హీరో షాహిద్ కపూర్, కృతి సనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. హోమి అడజానియా దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను ఈ నెల 29న విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఈ చిత్రానికి సంబంధించిన మ్యూజికల్ ఈవెంట్‌ను నిర్వహించింది చిత్రబృందం. రష్మిక మాట్లాడుతూ.. 'కాక్‌టెయిల్ 2' చాలా భిన్నమైన చిత్రం. మీ ఊహకు కూడా అందదు. ముఖ్యంగా ఈ సినిమాలో కృతి అద్భుతంగా నటించింది. మాకు, షాహిద్‌కు మధ్య కెమిస్ట్రీ మరో స్థాయిలో ఉంటుంది. ఈ భిన్నమైన ప్రేమకథను అందరూ ఎంజాయ్ చేస్తారు. ఇప్పటి వరకూ మీరు చూసింది చాలా తక్కువ. ముందు ముందు మంచి సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి. వాటిని చూడడం కోసం నేను కూడా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా' అని చెప్పుకొచ్చింది. మడాక్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం జూన్ 19న థియేటర్లలోకి రాబోతుంది.




## బాలల చిత్రంగా సమ్మర్ హాలిడేస్

ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై 'సమ్మర్ హాలిడేస్' అనే బాలల చిత్రం రాబోతోంది. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసే అందమైన కథతో దర్శకుడు శ్రీకర్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, 'మన శంకర వరప్రసాద్ గారు' మూవీ ఫేమ్ బేబి ఖుషి కీలక పాత్రలు పోషిస్తున్నారు. మంగళవారం ఖుషి పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి బర్త్ డే పోస్టర్ రిలీజ్ చేశారు. ఖుషి 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాలో మెగాస్టార్ చిరంజీవి కూతురి పాత్రలో నటించి అందరిని ఆకట్టుకుంది. ఇందులో ఆ చిన్నారి కీలక పాత్రతో మెప్పించనుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.



## కమల్ హాసన్ పొదుపు మంత్రం ఎకానమీ సీట్లో హైదరాబాద్‌కు రాక

విశ్వనాయకుడు కమల్‌హాసన్ తీసుకున్న ఓ నిర్ణయంతో ఆయన ఎంత గొప్ప నటుడో, ఆయన వ్యక్తిత్వం ఎంత గొప్పదో చెబుతూ వైజయంతీ మూవీస్ సంస్థ ఓ ట్వీట్ చేసింది. ఇటీవల కాలంలో సినిమా షూటింగ్ బడ్జెట్ కన్నా నటీనటులకు కల్పించే సౌకర్యాలు ఖర్చే ఎక్కువ అవుతోంది. మేకర్స్ అనవసరపు ఆర్భాటాల తగ్గించుకోవాలంటూ కమల్ హాసన్ ఇటీవల ఓ ప్రకటన జారీ చేశారు. అంతేకాదు దానిని ఆచరణ రూపంలోనూ చూపించారు. ఈ నేపథ్యంలో ఆయన 'కల్కి' సీక్వెల్ షూటింగ్‌కు ఎకానమీ ఫ్లైట్‌లో హైదరాబాద్‌కు వచ్చారు. దీనిని ఉదహరిస్తూ వైజయంతి మూవీస్ సంస్థ ఆయనను అభినందించింది.'ప్రస్తుతం సినిమా పరిశ్రమ నిర్మాణపరంగా ఎంతో కష్టాలను ఎదుర్కొంటోంది. ఇలాంటి సమయంలో కమల్‌హాసన్ ప్రైవేట్ చార్టర్ విమానాలు, విలాసవంతమైన ప్రయాణాలను పక్కనపెట్టి, ఎకానమీ ఫ్లైట్‌లో నేరుగా షూటింగ్ సెట్‌కు వస్తున్నారు. ఆ నిర్ణయం ఆయన ఎంతటి దిగ్గజమో తెలియజేస్తోంది. చిత్ర పరిశ్రమలో అద్భుతాలు జరగడానికి ఇది మొదటి అడుగు అనుకోవచ్చు' అని ట్వీట్‌లో వైజయంతి మూవీస్ సంస్థ పేర్కొంది. ప్రభాస్ హీరోగా నాగ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి కొనసాగింపుగా కల్కి పార్ట్ 2 రూపొందుతున్న సంగతి తెలిసిందే! ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఇందులో కమల్ సుప్రీం యాస్కిన్‌గా నటిస్తున్నారు. ఈ మధ్యన కమల్, అమితాబ్‌పై కీలక సన్నివేశాలను తెరకెక్కించారు. తాజా షెడ్యూల్ కోసం కమల్ హైదరాబాద్ వచ్చారు. దీనికి సంబంధించిన ఓ ఫొటోను వైజయంతీ సంస్థ ట్వీట్ చేసింది.

PRINTED AND PUBLISHED by VASISTA PRINTERS 18-97, 306, 3RD FLOOR, RAJINIGANDHA COMPLEX, KAMALA NAGAR, CHAITANYAPURI, SAROORNAGAR, RANGAREDDY, TELANGANA - 500060, RNI No :TGTEL/25/A4284 EDITOR KOMMU SRINIVAS, Contact - 9666023180 & 8096660656